# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 239 | విశాఖపట్నం | 30-5-2026 శనివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 239 | VISAKHAPATNAM | 30-5-2026 SATURDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI

PATHAKAM NEWS

SCAN & PAY

UPI ID: 44576280686@sbi

BHIM | UPI

yono SBI | BHIM SBI Pay

G Pay | Paytm | PhonePe




7లో

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకుల కొరత!

11 వేల మంది టీచర్లకు ఓపీఎస్!



2లో



6లో

పిల్లల్లో పెరుగుతున్న 'ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్'!

## పారిశ్రామిక కాలుష్య నివారణకు నిరంతర

# తనిఖీలు చేయాలి: పవన్



**అమరావతి, పతాకం న్యూస్:** రాబోయే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని నదిని కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. 'స్వచ్ఛ గోదావరి -- పవిత్ర పుష్కరాలు' లక్ష్యంగా ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని 6 జిల్లాల్లో గల 262 పుష్కర పంచాయతీలను గుర్తించి, వాటిని మురుగురహిత పంచాయతీలుగా మార్చాలని స్పష్టం చేశారు. మురుగు నీరు నేరుగా జీవనదిలో కలవకుండా మున్సిపాలిటీల సామర్థ్యానికి అనుగుణంగా మురుగు శుద్ధి ప్లాంట్ల (ఎస్టీపీ) నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ కాలుష్య నివారణ పనుల కోసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మంజూరు చేసిన రూ.100 కోట్ల (తరువాయి 2వ పేజీలో)

# డంపింగ్ యార్డుల రహితంగా ఏపీని మారుస్తాం: నారాయణ

**ఎన్టీఆర్ జిల్లా, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపాలిటీలను డంపింగ్ యార్డుల రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నం, గుంటూరులో 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్లు ఉన్నాయని, కొత్తగా మరో ఆరు ప్లాంట్లను నెలకొల్పుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ లోగా 107 మున్సిపాలిటీల్లో ఉత్పత్తి అయ్యే చెత్త నిర్వహణ కోసం ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్లాంట్ల ద్వారా ప్రతి రోజూ 5,385 టన్నుల చెత్తను కంపోస్ట్, బయోగ్యాస్‌గా మారుస్తామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి, ఇబ్రహీంపట్నంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పర్యటించారు. కొండపల్లిలో కొత్తగా నిర్మిస్తున్న ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్‌ను పరిశీలించగా, ఇబ్రహీంపట్నంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 'ఏపీ ప్రజల నుంచి గత



ప్రభుత్వం చెత్త పన్ను వసూలు చేసింది. అయినా 150 లక్షల టన్నుల చెత్తను వదిలి (తరువాయి 2వ పేజీలో)



# నష్ట పరిహారం ఎప్పుడిస్తారు?

## భోగాపురం ఎయిర్‌పోర్టు బాధితులు

**భోగాపురం, పతాకం న్యూస్:** ఏరు దాటే వరకు ఓడ మల్లన్న.... ఏరు దాటాక బోడి మల్లన్నా అన్నాడట వెనుకటికి ఓ మహానుభావుడు. భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు వ్యవహారంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అలాగే వుంది. భూములు ఇచ్చేవరకు ఈ ప్రాంతం బాగుపడుతుందని, ఉద్యోగాలు, ఉపాధికి ఢోకా లేదంటూ నమ్మబలికిన ప్రభుత్వం చివరకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించకుండానే ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవానికి తహతహలాడుంది. బాధిత నిర్వాసితులు తమ గోడు వినిపించుకునేందుకు కూడా అవకాశం లేకుండా ఎస్మా చట్టాన్ని ముందే సిద్ధం చేసింది. భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు పేరిట మొత్తం 2,830.08 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. ఇందులో ప్రధాన ఎయిర్ పోర్టు నిర్మాణానికి సుమారు 2,750.15 ఎకరాలు, ట్రంపెట్ (హైవే కనెక్టివిటీ)కి 60.08 ఎకరాలు, అప్రోచ్ రోడ్డుకు 19.85 ఎకరాలు సేకరించింది. ప్రభుత్వ భూములతో పాటు జిరాయితి, డి-పట్టా, పిఒటి, బంజరు భూములు కూడా ఇందులో ఉన్నాయి. 2015లోనే భూసేకరణ ప్రారంభించారు. అప్పట్లో ఎంతోకొంత చేతిలోపెట్టి భూములు లాగేసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నించినప్పటికీ నిర్వాసితుల తరపున సిపిఎం పోరాటం, ఇందుకు ఇతర వామపక్ష పార్టీలు కలిసిరావడం వల్ల అది సాధ్యం కాలేదు. నాటి పోరుబాటతో తొలుత పదివేల ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం ప్రకటించినా చివరకు 5,311.88 ఎకరాలకు కుదించింది. ఇందుకు కూడా ససేమిరా అంగీకరించకపోవడంతో చివరకు 2750.15 ఎకరాలకు తగ్గింది. ఇందులో 546.89 ఎకరాలు రిజర్వులో ఉంచి, మిగిలిన 2203.36 ఎకరాల భూమిని ఎపి ఎయిర్ పోర్ట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపి ఎడిసిఎల్)కు ప్రభుత్వం అప్పగించింది. ఇందులో భాగంగా భోగాపురం మండలం సవిరివిల్లి, ఎ.రావివలస, గూడెపువలస, కంచేరు, కవులవాడ, రావాడ, ముంజేరు గ్రామాల ప్రజానీకం పెద్దఎత్తున భూములు (తరువాయి 2వ పేజీలో)

## రోడ్డు ప్రమాదంలో

# ఐదుగురు మృతి



**కర్ణాటక, పతాకం న్యూస్:** చిత్రదుర్గ జిల్లా తుమకుర్లహల్లి గేట్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న కారు టైరు పేలిపోవడంతో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతులను రాఘవేంద్ర, రుద్రేశ్, సోమ, మల్లికార్జున్, ప్రమోద్‌గా పోలీసులు గుర్తించారు. వీరు బళ్లారి నుంచి చల్లకెరెకు వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. మృతులు ఐదుగురు వ్యక్తిగత కారణాల నిమిత్తం కారులో బళ్లారికి వెళ్లారు. పని పూర్తయిన తర్వాత చల్లకెరెకు తిరుగు ప్రయాణమయ్యారు. అయితే, మొలకల్మూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తుమకుర్లహల్లి గేట్ వద్దకు రాగానే ప్రమాదవశాత్తూ కారు టైరు పేలింది.

# మహిళల భద్రతకు 'ఆపరేషన్ దండాయన'

## ఏపీ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా





**అమరావతి, పతాకం న్యూస్:** మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలను పూర్తిగా అరికట్టేందుకు, బాధితులకు వేగవంతమైన న్యాయం అందించేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ దండాయన' పేరుతో ప్రత్యేక కార్యాచరణను ప్రారంభించింది. మహిళల భద్రతను అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణిస్తూ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆధ్వర్యంలో, మహిళా & శిశు భద్రత విభాగం ఐజీపీ బి. రాజ కుమారి నేతృత్వంలో ఈ కార్యాచరణ అమల్లోకి వచ్చింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా శుక్రవారం ఏపీ పోలీసు ప్రధాన (తరువాయి 2వ పేజీలో)

## రాహుల్ గాంధీతో

# షర్మిల భేటీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీతో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల భేటీ అయ్యారు. కర్ణాటకలో త్వరలో రాజ్యసభ ఎన్నికలు ఉన్నాయి. ఇలాంటి సమయంలో ఆమె పార్టీ అగ్రనాయకుడితో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఢిల్లీలో జరిగిన ఈ భేటీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉన్నారు. కర్ణాటక నుంచి రాజ్యసభ సీటును షర్మిల కోరుతున్నట్లు మీడియాలో ప్రచారం సాగుతోంది. వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసిన సమయంలో షర్మిలకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం రాజ్యసభ సీటును హామీ ఇచ్చిందని తెలుస్తోంది. రాజ్యసభలో కాంగ్రెస్ తరపున ఏపీ గొంతును వినిపించడానికి తనకు రాజ్యసభ సీటును ఇవ్వాలని ఆమె కోరుతున్నారని తెలుస్తోంది.


పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తెస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## కార్మికుల సమస్యలు..

రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై కూటమి ప్రభుత్వం నిత్యం సమీక్షలు చేస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని తలుస్తోంది. విద్యా సంస్థలు, ఆర్థిక సంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రులు తదితరాలకు వచ్చే పెట్టుబడులు, కేటాయించిన భూములు, వాటి నిర్మాణం ఎపుడు పూర్తయ్యేదీ వివరాలతో సహా వార్తలు వస్తున్నాయి. టిడిపి ప్రభుత్వం మొదటి పాలనా కాలంలో మొదలైన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లు, ఎన్‌జీఓలు, క్లాస్ 4 ఉద్యోగులు, ఐఎఎస్‌ల నివాస బ్లాక్‌లు, ఉన్నతాధికారులు, మంత్రుల విడిది గృహాల నిర్మాణాలు ఒకటి, రెండు సంవత్సరాల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. అన్నింటికంటే ముఖ్యంగా అసెంబ్లీ, కౌన్సిల్, హైకోర్టు, అత్యంత ఎత్తుతో కూడిన సెక్రటేరియట్, హెచ్‌ఓడీ ల భవనాల నిర్మాణ కార్యకలాపాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇవి పూర్తికావటానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. పరిపాలన, న్యాయ, శాసన సంబంధిత నిర్మాణాలన్నీ దాదాపుగా ఒకే రహదారిలో రెండు వైపులా కనపడతాయి. వీటి నిర్మాణంపై నిత్యం సమీక్ష కొనసాగుతోంది. మరోవైపు బ్యాంకులు, విద్యాలయాలు, ఆసుపత్రులు, హోటళ్లకు కేటాయించిన భూములలో నిర్మాణ సన్నాహాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ సంబంధిత నిర్మాణాలతో పాటు, రోడ్ల నిర్మాణం కూడా పెద్ద ఎత్తున కొనసాగుతోంది. వేలాది మంది ఇతర రాష్ట్రాల వలస కార్మికులు ఈ నిర్మాణాల్లో పాల్గొంటున్నారు. స్థానికులు వున్నా వారి సంఖ్య అత్యల్పం. ఏపి కి చెందిన వారు ఇంజినీర్లు, ఆపై స్థాయిల్లోనూ ఉన్నారు. వలస కార్మికుల వేతనాలు, పని పరిస్థితులు, నివాస సౌకర్యాలు, ఆరోగ్య సౌకర్యాలు తదితర అంశాలపై ఇంత వరకూ ఎక్కడా, ఏ స్థాయిలోనూ సమీక్షలు జరగలేదు. పని చేసే వలస కార్మికులు కనీస నాగరిక జీవనాన్ని గడుపుతున్నారా లేదా? అని చూసేవారు కూడా లేరు. ఇటీవల ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు పర్యటనకు వస్తున్నారని ముందుగా తెలిసిన తర్వాత అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎం.డి లక్ష్మీ పార్థసారథి కార్మికుల నివాస ప్రాంతాలను సందర్శించారు. ఆ తర్వాత ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు కూడా ఆ ప్రాంతాల్లో పర్యటించారు. వీరిరువురూ కూడా నివాస ప్రాంతాల్లో సౌకర్యాల లేమిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అయినా పరిస్థితిలో మార్పు కనబడలేదు. టాయిలెట్లలో సరైన సౌకర్యాలు లేవు. పాచి పట్టిన నీటితో బహిరంగంగా స్నానాలు చేయాలి. నిర్మాణ పనుల్లో ఉన్న కార్మికుల్లో హెల్పర్లకు నెలకు రూ.15 వేలు, సూపర్‌వైజర్లు/మేస్త్రీలకు నెలకు రూ.28 వేల నుండి రూ.30 వేలు ఇస్తున్నారు. కానీ ఈ వేతనాలు రావడానికి రోజుకు 12 గంటల పాటు పని చేయాలి. వాస్తవానికి 8 గంటల పనికిగాను హెల్పర్లకు రూ.7,500, సూపర్‌వైజర్లు/మేస్త్రీలకు రూ.14 వేల నుండి రూ.15 వేలు మాత్రమే వేతనాలు వస్తాయి. 8 గంటలు మించి పని చేసిన దానికి డబల్ ఓటీలు లేవు. ప్రాథమిక చికిత్సకు మాత్రమే అరకొర సౌకర్యాలు ఉన్నాయి. ఆసుపత్రి సౌకర్యాలు లేవు. కార్మికులకు పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ లేదు. ఎల్ అండ్ టి లాంటి పెద్ద నిర్మాణ సంస్థకు చెందిన ఇతర ప్రాజెక్టుల్లో పని చేసి అమరావతికి వచ్చిన కార్మికులకు మాత్రమే పి.ఎఫ్ కొనసాగుతోంది. కార్మికులు తమ కుటుంబాలతో వచ్చి అక్కడ ఉండేందుకు అవకాశాలు కల్పించలేదు. ఎల్ అండ్ టి, షాపూర్జీ పల్లోంజీ, నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ, మేఘా ఇంజినీరింగ్, కెపిసి ప్రాజెక్ట్స్, బి.ఎస్.ఆర్ ఇన్‌ఫ్రా, ఆర్.వి.ఆర్ అసోసియేట్స్, బీమా ప్రాజెక్ట్స్ తదితర బడా నిర్మాణ కంపెనీలు అమరావతి నిర్మాణంలో పాల్గొంటున్నాయి. ఇవి అమరావతిలో బిల్డింగులు కట్టడమే కాకుండా రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ తదితర పనుల్లో ఉన్నాయి. ఈ కంపెనీలు నేరుగా కార్మికులను పెట్టుకోవు. కాంట్రాక్టర్ల ద్వారా కార్మికులను తెప్పించుకుని వారి ద్వారా పనులు చేయించుకుంటాయి. కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలు, కల్పించాల్సిన బెనిఫిట్లు, సౌకర్యాలకు అయ్యే నిధులను ఈ కంపెనీలే కాంట్రాక్టర్లకు సమకూర్చుతాయి. ఈ బడా కంపెనీలు ప్రిన్సిపల్ యజమానులుగా కార్మికుల వేతనాలు, బెనిఫిట్లు, ఇతర సౌకర్యాలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. కానీ ఇవి కాంట్రాక్ట్ కార్మికులతో మాకు సంబంధం లేదని, ఆ విషయం కాంట్రాక్టర్లే చూసుకుంటారని చెబుతూ తప్పించుకుంటాయి.

## సంక్షేమ పథకాలకు కూడా డిజిటల్ కరెన్సీ... ఆర్బీఐ యోచన




**ముంబై, పతాకం న్యూస్:** డిజిటల్ కరెన్సీని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రిటైల్ రంగానికి కూడా విస్తరించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) యోచిస్తోంది. డిజిటల్ కరెన్సీ వినియోగాన్ని విస్తృతం చేయనున్నట్లు ఆర్బీఐ తన వార్షిక నివేదికలో పొందుపరిచింది. ఈ క్రమంలో డిజిటల్ కరెన్సీ పైలట్ ప్రాజెక్టును మరింత విస్తరించనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరాలలో గుజరాత్, పుదుచ్చేరి, చండీగఢ్‌లలో నగదు బదిలీ పథకాల కింద డిజిటల్ కరెన్సీని ప్రయోగాత్మకంగా పరిశీలించినట్లు ఆర్బీఐ తెలిపింది. రేషన్ లబ్ధిదారులకు కూడా ఆహార సబ్సిడీని సీబీడీసీ ద్వారా అందించారు. లబ్ధిదారులకు అందిన నిధులను రేషన్ షాపులు, ఎంపిక చేసిన వ్యాపారుల వద్ద వస్తువుల కొనుగోలుకు మాత్రమే ఉపయోగించేలా చూశారు. దీనిని మరింత విస్తరించాలని ఆర్బీఐ భావిస్తోంది. ఇకముందు సీబీడీసీ పైలట్ ప్రాజెక్టులో మరింత మందిని భాగస్వాములుగా చేయాలని భావిస్తున్నట్లు ఆర్బీఐ తన నివేదికలో పేర్కొంది.

## మక్కువలో తాగునీటి కష్టాలు ..!



**మక్కువ, పతాకం న్యూస్:** మండల కేంద్రం మేజర్ పంచాయతీ మక్కువ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు మొదలయ్యాయి. రెండు రోజులగా రక్షిత్ తాగునీరు పథకం ప్రధాన పైపులైను మరమ్మతుకు గురికావడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సుమారు 7500 జనాభా ఉన్న మక్కువకు లక్ష ఇరవై లీటర్ల సామర్థ్యం గల రక్షిత పథకం ట్యాంకులు రెండు నిర్మించారు. ఈ ట్యాంకుల ద్వారా వచ్చే నీటి సరఫరా తగినంతగా లేకపోవడంతో రెండు మూడు సార్లు ట్యాంకులను నింపుకోవాల్సిన పరిస్థితి. సుమారు 20 ఏళ్ల నాటి పైపులైన్లు రెండు కిలోమీటర్లు పొడుగునా ఏర్పాటు కావడంతో తరచూ మరమ్మతుకు గురవుతూనే ఉన్నాయి. గతంలో పంచాయతీ పాలనలో వెంటనే స్పందించే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ప్రత్యేక అధికారుల పాలన రావడంతో అధికారులు ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదనీ స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ప్రజలకు రక్షిత నీరు అందేలా వెంటనే అధికారులు స్పందించి రక్షిత పైపులైనుకు మరమ్మతులు చేపట్టాలని మేజర్ పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

## శ్రీ చైతన్య కాలేజీలో విద్యార్థి ఆత్మహత్య

**కృష్ణా జిల్లా, పతాకం న్యూస్:** గన్నవరం మండలం కేసరపల్లిలోని శ్రీ చైతన్య గాయత్రి వేదవ్యాస్ క్యాంపస్‌లో విద్యార్థి ఆత్మహత్య ఘటన కలకలం రేపింది. అనంతపురం జిల్లాకు చెందిన కప్పల యశ్వంత్(18) అనే విద్యార్థి తన హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు క్యాంపస్‌కు చేరుకుని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తమ కుమారుడి మృతికి కారణాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు.

(మొదటిపేజీ తరువాయి)

## నష్ట పరిహారం ఎప్పుడిస్తారు?

కోల్ఫోగా, బొల్లెంకులపాలెం, ముడసర్లపేట, మరడపాలెం, రెల్లిపేట గ్రామాలు పూర్తిగా కనుమరుగయ్యాయి. ఎయిర్ పోర్టు కోసం రైతులు తమ భూములు, ఊళ్లు త్యాగం చేసేందుకు ముందుకు వచ్చినప్పటికీ తగిన పరిహారం ఇచ్చేందుకు అప్పట్లో ప్రభుత్వం మీనమేషాలు లెక్కించింది. నిర్వాసితుల పోరాటంతో ఎట్టకేలకు జిరాయితీ భూములకు రూ.28లక్షల నుంచి రూ.34లక్షల వరకు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించినప్పటికీ, అసైన్ మెంట్ భూములకు రూ.12.5లక్షలకు మించి ఇచ్చేందుకు ముందుకు రాలేదు. దీంతో, నిర్వాసితుల మరో పోరాటం చేస్తుండగా, న్యాయస్థానం తీర్పు ఈ పోరాటానికి తోడవ్వడంతో జిరాయితీతో సమానంగా ఇచ్చేందుకు సర్కారు అంగీకరించింది. ఈ క్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జగన్ మోహన్‌ను అప్పట్లో అడుగడుగునా అరెస్టులు చేసిన సంగతి విదితమే. కానీ, ఆచరణలో ప్రభుత్వం మాట నిలబెట్టుకోకపోవడంతో మరోసారి ఆందోళన చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలో చాలా మంది రైతులు కోర్టుకు వెళ్లారు. ఈలోపు ఎంతోకొంత అంటగట్టి భూములు వశపరుచుకునే క్రమంలో 70ఎకరాలకు సంబంధించి ప్రభుత్వం కేటాయించిన సుమారు రూ.23.80కోట్ల పరిహారాన్ని అప్పటి ప్రభుత్వ పెద్దల సూచనల మేరకు రెవెన్యూ అధికారులు ట్రిబ్యునల్ కోర్టులో జమచేశారు.

వైసిపి ప్రభుత్వంలో మధ్యవర్తుల ఒప్పందం ద్వారా పరిహారం పెంచుతామని చెప్పినప్పటికీ ఆచరణలో కనిపించలేదు. ఇటీవల కొందరికి పరిహారం ముట్టజెప్పినప్పటికీ, చాలా మందికి సాంకేతిక కారణాలు, పత్రాల పరిశీలన వంటి సాకులు చూపి ఇవ్వలేదు. ఇలా సుమారు 400 ఎకరాలకు సంబంధించి సుమారు 100మందికిపైగా రైతులకు ఇంకా నష్టపరిహారం చెల్లించలేదని అంచనా. మొత్తం భూమిలో ఇంకా ఎన్ని ఎకరాలకు సంబంధించి ఎంతమందికి, ఎంతమేర నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది? ఎన్ని కేసులు కోర్టుల్లో ఉన్నాయి? అనే వివరాలను అధికార యంత్రాంగం బయటకు వెల్లడించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఓవైపు నష్టపరిహారం కోసం నిర్వాసితుల ఆందోళన, మరోవైపు కోర్టులో కేసులు ఉండగానే జులై ఐదున ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేతుల మీదుగా ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం నిర్వహించేందుకు ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఎయిర్ పోర్టు పరిసర ప్రాంతాలను పూర్తిగా అధికారుల నియంత్రణలోకి తీసుకొని, అక్కడ నుంచి నిర్వాసితుల గొంతు వినిపించకుండా, సమస్యలు బాహ్య ప్రపంచానికి తెలియనీయకుండా నిరోధించేందుకు ప్రభుత్వం తాజాగా ఎస్మా చట్టాన్ని అమల్లోకి తెచ్చిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై కేసులు ఎత్తివేయాలి : ఏపీడబ్ల్యుజెఎఫ్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌పై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, వాక్ స్వాతంత్ర్యాన్ని కాపాడాలని కోరుతూ .... ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. మీడియా స్వేచ్ఛను హరించవద్దని నినాదాలు చేశారు. తొలుత గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ్ కార్యవర్గ సభ్యులు కె.అప్పలనాయుడు మాట్లాడుతూ .... ప్రొఫెసర్ నాగేశ్వర్ అనేక అంశాలపై విశ్లేషణలు చేస్తూ ఉంటారని, ఇటీవల ఆయన చేసిన ఓ వ్యాఖ్యను ఆధారంగా చేసుకుని ఆయనను కొందరు వ్యక్తిత్వ హననానికి పాల్పడడం శోచనీయమన్నారు. ఆయనపై సోషల్ మీడియాలో అసభ్యకర, పోస్టులు పెట్టడం మానుకోవాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్య హక్కును కాలరాసే అధికారం ఎవరికీ లేదన్నారు. ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నట్టు ప్రకటించినప్పటికీ ఆయనపై బెదిరింపులకు దిగడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ఎన్.మధు, మదన్, ఈశ్వరరావు, రవిశంకర్, కె.రాజేష్, సతీష్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## తనిఖీలు చేయాలి: పవన్

నిధులను వినియోగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గోదావరిని కలుషితం చేస్తున్న రోజువారీ వ్యర్థాల భయంకరమైన గణాంకాలను ఆయన వెల్లడించారు. నదిలోకి ప్రతిరోజూ 104 మిలియన్ లీటర్ల మురుగు నీరు చేరుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి రోజూ గ్రామీణ ప్రాంతాల మురుగు 8.38 మిలియన్ లీటర్లు గోదావరిలో కలుస్తున్నాయని అదే విధంగా పారిశ్రామిక వ్యర్థాల్లో ఆంధ్ర పేపర్స్ వెదజల్లే రోజువారీ కాలుష్యమే 32 మిలియన్ లీటర్లు ఉంటుందని తెలిపారు. నిత్యం గోదావరిలో కలిసే 13.24 మిలియన్ లీటర్ల ఆక్వా కాలుష్యం వీటికి అదనని చెప్పారు. పారిశ్రామిక, ఆక్వా కాలుష్య నివారణకు అధికారులు నిరంతర తనిఖీలు నిర్వహించాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. పర్యవేక్షణ కోసం ఆర్టీజీఎస్ తరహా కంట్రోల్ రూం ఏర్పాటు చేసి నదిని నిరంతరం లైవ్ మానిటరింగ్ చేయాలని సూచించారు. ఈ బాధ్యతను 'పర్యావరణ పరిరక్షణ టాస్క్ ఫోర్స్'కు అప్పగించారు. రాబోయే 2027 గోదావరి పుష్కరాలను ప్లాస్టిక్ రహితంగా మరియు ఆధ్యాత్మిక ఉట్టిపడేలా నిర్వహించడమే ప్రభుత్వ ప్రధాన సంకల్పమని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. కొద్ది రోజుల క్రితం పవన్ కళ్యాణ్ గోదావరిని సందర్శించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గోదావరిని పరిశీలించిన పవన్ అందులో కలుస్తున్న వ్యర్థాల గురించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో దీని గురించి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

## డంపింగ్ యార్డుల రహితంగా ఏపీని మారుస్తాం: నారాయణ

వెళ్లిపోయింది. ఆ చెత్తను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలగిస్తున్నాం. వచ్చే నెలాఖరు నాటికి అన్ని ప్లాంట్లు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం. ఐదు కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల కోసం ఏపీ ప్రభుత్వం రూ.59.85 కోట్లు మంజూరు చేసింది. రాజమహేంద్రవరం, నెల్లూరు, గుంటూరు, ఒంగోలు, ఇబ్రహీంపట్నంలో నూతన సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. విజయవాడలో ఉన్న ప్లాంట్‌ను కూటమి ప్రభుత్వం రూ.9.45 కోట్లతో ఉన్నతీకరిస్తోంది. మొత్తం ఐదు ప్లాంట్ల ప్రాసెసింగ్ సామర్థ్యం రోజుకు 125 టన్నులు. ప్రతి యూనిట్‌ను రోజుకు 25 టన్నుల సామర్థ్యంతో రూపకల్పన చేశాం. ఒక్కో నూతన ప్లాంట్‌కు రూ.12.60 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. ఇందుకు కేంద్రం, రాష్ట్రం, పట్టణ స్థానిక సంస్థలు, ప్రైవేట్ డెవలపర్లు నిధులు సమకూర్చనున్నారు. పురపాలక వ్యర్థాలను స్వచ్ఛమైన శక్తిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం. పట్టణ వ్యర్థాల నిర్వహణలో విప్లవాత్మక మార్పు తీసుకొస్తాం. సుస్థిర వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తి దిశగా కీలక అడుగు వేశాం. డంపింగ్ యార్డుల భారాన్ని తగ్గించేందుకు సీబీజీ ప్లాంట్లు దోహదపడతాయి. పట్టణ ఇంధన భద్రతను బలోపేతం చేసే ప్రాజెక్టుగా సీబీజీ ప్లాంట్లు ఉపయోగపడతాయి. దీర్ఘకాలిక పర్యావరణ, ఆర్థిక సుస్థిరతకు ఈ ప్రాజెక్ట్ భరోసా ఇస్తుంది. స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. వ్యర్థాల నుంచి సంపద సృష్టించడమే కూటమి ప్రభుత్వ విధానం' అని పేర్కొన్నారు.

## మహిళల భద్రతకు 'ఆపరేషన్ దండాయన'

కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఆపరేషన్ దండాయన కార్యక్రమంలో భాగంగా మహిళలపై జరిగే అత్యాచారాలు, లైంగిక వేధింపులు, పోక్సో కేసులు తదితర నేరాల్లో నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నమోదయ్యే మహిళా సంబంధిత ప్రతి కేసును ప్రత్యేకంగా పర్యవేక్షించనున్నారు. దర్యాప్తు ప్రక్రియలో జాప్యం లేకుండా చూసేందుకు 'స్పీడ్ ట్రయల్ మానిటరింగ్ సిస్టమ్' అమలు చేయాలని నిర్ణయించారు. కేసుల పురోగతిని జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిరంతరం సమీక్షిస్తూ న్యాయ ప్రక్రియను వేగవంతం చేయనున్నారు. ముఖ్యంగా ప్రతి కేసులో 60 రోజుల్లోగా ఛార్జిషీట్ దాఖలు చేయడం తప్పనిసరిగా పేర్కొన్నారు. సంచలనాత్మక కేసులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు బదిలీ చేసి, నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోనున్నారు. మహిళలపై నేరాల విషయంలో లి'జీరో టాలరెన్స్ పాలసీ'ని ఖచ్చితంగా అమలు చేస్తామని డీజీపీ శ్రీ హరీష్‌కుమార్ గుప్తా స్పష్టం చేశారు. నిందితులు ఎంతటి రాజకీయ, ఆర్థిక లేదా సామాజిక పరిపుష్టి కలిగిన వారైనా చట్టం ముందు అందరూ సమానమేనని తెలిపారు. ప్రతి బాధితురాలికి పూర్తి న్యాయం జరిగే వరకు పోలీసు శాఖ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. బాధిత మహిళలకు కేవలం న్యాయ సహాయం మాత్రమే కాకుండా, మానసిక ధైర్యం కల్పించేలా కౌన్సెలింగ్ సేవలను కూడా అందించనున్నారు. ఇందుకోసం స్వచ్ఛంద సంస్థలు, న్యాయవాదులు, మహిళా సంక్షేమ సంస్థల సహకారాన్ని తీసుకోనున్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయనున్నారు. మహిళలపై పదేపదే నేరాలకు పాల్పడే నేరస్తులు, అనుమానాస్పద వ్యక్తులపై జియో ట్యాగింగ్, FRS (Facial Recognition System) ద్వారా.. వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను డీజీపీ ఆదేశించారు. లైంగిక నేరస్తులపై సెక్సువల్ అఫెండర్స్ షీట్స్ తెరచి.. వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని... అలాగే పెండింగ్‌లో ఉన్న కేసులను పునఃసమీక్షించి, దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో మహిళల భద్రతను మరింత బలోపేతం చేయడానికి 'నైబర్‌హుడ్ వాచ్' కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయనున్నారు. గ్రామాలు, పట్టణాల్లో స్థానిక ప్రజల సహకారంతో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించే విధానాన్ని ప్రోత్సహించనున్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ జియోట్యాగింగ్, డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థల ద్వారా నేరస్థులపై మరింత సమర్థవంతమైన నిఘా కొనసాగించనున్నారు.

# జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 18 వినతులు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమంలో 18 వినతులు స్వీకరించడమైనదని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల తన ఛాంబర్ లో డీసీపీలు, ఏసీపీ లతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.. ఈ సందర్భంగా చీఫ్ సిటీ ప్లానరు మాట్లాడుతూ జీవీఎంసీ లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీఆర్‌జీఎస్ కార్యక్రమంలో జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నందున, జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు/ వినతులను స్వీకరించేందుకు గానూ ప్రత్యేకంగా ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు.

శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమానికి సంబంధించి 18 వినతులు స్వీకరించడం జరిగినదని, అందులో ముఖ్యంగా భీమిలి జోన్ కు 02, మధురవాడ జోన్ కు 03, సౌత్ జోన్ కు 03, నార్త్ జోన్ కు 08, వెస్ట్ జోన్ కు 01, పెందుర్తి జోన్ కు 01 వినతులు వచ్చాయని తెలిపారు. స్వీకరించిన వినతులను /ఫిర్యాదులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించడమైనదన్నారు.

# విశాఖలో క్రమంగా క్షీణిస్తున్న గాలి నాణ్యత

## రెస్పైర్ లివింగ్ సైన్సెస్ అనే సంస్థ అధ్యయనంలో వెల్లడి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నంలో గాలి నాణ్యత క్రమంగా క్షీణిస్తోంది. పది రోజుల్లో ఏడు రోజులు ప్రమాదకరమైన స్థాయిలో ఉంటోందని ఒక అధ్యయనంలో వెల్లడైంది. జిల్లాలో పరిశ్రమలు, పోర్టు కార్యకలాపాలు, వాహనాల రద్దీయే దీనికి కారణమని తేల్చింది. హైదరాబాద్‌కు చెందిన రెస్పైర్ లివింగ్ సైన్సెస్ అనే సంస్థ విశాఖపట్నంలో 2024 నుంచి 2026 ఏప్రిల్ వరకు గాలి నాణ్యత, కాలుష్యంపై అధ్యయనం చేసింది. ఆ వివరాలను మీడియాకు విడుదల చేసింది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన మానటరింగ్ స్టేషన్ నుంచి 2026లో జనవరి-ఏప్రిల్ వరకు తీసుకున్న గణాంకాల ప్రకారం పీఎం 10 (10 మైక్రో మీటర్లు, అంతకంటే తక్కువ వ్యాసం కలిగిన గాలిలో తేలియాడే అతి చిన్న ధూళి కణాలు) జాతీయ స్థాయి ప్రామాణికం కంటే అధికంగా నమోదైంది. ఆ నాలుగు నెలల్లో 70.68 శాతం రోజులు ఇలా ఎక్కువగానే ఉండడం గమనార్హం. గత రెండేళ్లలో నైట్రోజన్ డయాక్సైడ్ స్థాయి కూడా 32 శాతం అధికంగా రికార్డు అయ్యింది. రాష్ట్రంలో అత్యంత కాలుష్య కేంద్రంగా విశాఖ గుర్తింపు తెచ్చుకుందని ఆ సంస్థ పేర్కొంది. 2026లో పీఎం10 వార్షిక సగటు 139.58 మైక్రోగామ్స్‌గా రికార్డు అయింది. ఇది జాతీయ ప్రమాణానికి రెట్టింపు. రాష్ట్రంలో అత్యంత కాలుష్య కేంద్రంగా వరుసగా మూడో ఏడాది కూడా జీవీఎంసీ మానటరింగ్ సెల్ రికార్డులకు ఎక్కింది. పారిశ్రామిక వ్యర్థాలు, పోర్టులో సరకు రవాణా, ఆయిల్ రిఫైనరీల ఆపరేషన్లు, స్టీల్ ప్లాంటు, వాహనాల కాలుష్యమే దీనికి కారణంగా గుర్తించారు.

# భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఏసీ బస్సులు నడిపేందుకు రూట్ సర్వే



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** కూర్మన్నపాలెం డిపో నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఏసీ బస్సులు నడిపేందుకు అధికారులు రూట్ సర్వే నిర్వహించారు. జిల్లా కలెక్టర్, వీఎంఆర్డీఏ, జీవీఎంసీ కమిషనర్ల ఆదేశాల మేరకు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, జీవీఎంసీ సిటీ ప్లానర్ ధనుంజయరెడ్డి, జీఎంఆర్ సంస్థ ప్రతినిధి రాజేష్ ఈ సర్వే చేశారు. జూలై రెండో వారంలో భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి విమానాల రాకపోకలు ప్రారంభమయ్యే అవకాశం ఉందంటున్నారు. ఈ నేపథ్యంలో నగరం నుంచి విమాన ప్రయాణికుల రవాణాకు సంబంధించి ఏర్పాట్లు చేసేందుకు అధికారులు ఈ సర్వే నిర్వహించారు. కూర్మన్నపాలెం నుంచి భోగాపురం సుమారు 60 కిలోమీటర్లు ఉంటుంది. ఏయే ప్రాంతాల నుంచి విమాన ప్రయాణికులు ఎక్కువ మంది ఉంటారో అంచనా వేసి, అక్కడకు దగ్గరలో జాతీయ రహదారిపై ఏసీ లాంజ్‌లు నిర్మించాలని భావిస్తున్నారు. ఈ మేరకు ప్రాథమికంగా కూర్మన్నపాలెం, గాజువాక, ఎన్ఏడీ, మద్దిలపాలెం, మధురవాడ, తగరపువలస ప్రాంతాలను ఎంపిక చేశారు. విమాన ప్రయాణికుల కోసం విలాసవంతమైన సౌకర్యాలతో ప్రత్యేకంగా రూపొందించిన ఎనిమిది ఏసీ బస్సులు జూన్ నెలాఖరులోగా నగరానికి వచ్చే అవకాశం ఉందని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు వెల్లడించారు. ఇవన్నీ ఎలక్ట్రిక్ బస్సులని, వాటి కోసం భోగాపురం ఎయిర్‌పోర్టులోనే తాత్కాలిక చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుచేయడం జరుగుతుందని తెలిపారు. తొలుత ఎనిమిది బస్సులు నడిపి, ప్రయాణికుల డిమాండ్ ఉంటే రూట్లు, బస్సుల సంఖ్య పెంచుతామని తెలిపారు.

# గ్రామాల్లో సమస్యలకు శాశ్వత పరిష్కారం: గంటా







**ఆనందపురం, పతాకం న్యూస్:** గ్రామాల్లో సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న ఆలోచనతో ప్రభుత్వం ప్రారంభించిన "ఒక నెల - ఒక గ్రామం - నాలుగు పర్యటనలు" కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన రెండో విడత "ఒక నెల - ఒక గ్రామం - నాలుగు పర్యటనలు" లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికార యంత్రాంగమే ప్రజల దగ్గరకు వచ్చి సమస్యలకు పరిష్కారం చూపించడమనేది అరుదైన విషయమన్నారు. ప్రస్తుతం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నప్పటికీ దూరంగా ఉన్న కలెక్టరేట్ కు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. మరోవైపు ప్రజా ఫిర్యాదులను అత్యధికంగా ఆయా ప్రభుత్వ విభాగాలకు పంపి బాధ్యత తీరిపోయిందనే ఆలోచన సరి కాదని అభిప్రాయపడ్డారు. సమస్యలపై మరింత శ్రద్ధ కేంద్రీకరించడానికి, శాశ్వత పరిష్కారానికి ఈ కార్యక్రమం ఉపకరిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అధికారాలకు సూచించారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, ఆర్డీఓ కె.సంగీత్ మాధుర్ లు అర్జీలు స్వీకరించారు. ఎమ్మార్వో శ్రీనుబాబు, ఎంపీడీఓ జానకి, డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణ, టీడీపీ నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాత్రాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, లొడగల వెంకట్రావు, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, గంట్రెడ్డి సోమినాయుడు

## సరియా జలపాతంలో పడి.

# గోపాలపట్నం యువకుడు మృతి




**గోపాలపట్నం, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం సరియా గ్రామం గ్రామానికి దగ్గరలో ఉన్న వాటర్ ఫాల్స్ ని సందర్శించడానికి ముగ్గురు యువకులు గోపాలపట్నం ప్రాంతం విశాఖ జిల్లా నుంచి వెళ్ళగా ఇండగబిల్లి వరప్రసాద్ అనే వ్యక్తి నీటిలో జారిపోయి విగత జీవిగా మిగిలిపోయాడు. చనిపోయిన వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి నీటిలో నుంచి బయటికి తీసిన స్థానికులు...పోస్ట్ మర్టశీ నిమత్తం హాస్పిటల్ కి పంపించినట్లు తెలుస్తోంది

# స్టీల్‌ప్లాంట్‌కు కోక్ కొరత



**అమరావతి, పతాకం న్యూస్:** స్టీల్‌ప్లాంటు పరిస్థితి ముందు నుయ్యి...వెనుక గొయ్యి అనే చందంగా మారింది. స్టీల్ తయారీలో కీలకమైన కోక్ ధర ప్రపంచ మార్కెట్‌లో రోజురోజుకూ పెరిగిపోతోంది. కోకింగ్ కోల్ తెచ్చుకుని ఇక్కడే కోక్ తయారు చేసుకుంటే టన్నుకు రూ.25 వేల కంటే తక్కువే అవుతుంది. కానీ అందుకు అత్యంత కీలకమైన కోక్ ఓవెన్ బ్యాటరీలు ప్లాంటులో శిథిలావస్థకు చేరడంతో అవసరమైన మేర కోక్ తయారు చేసుకోలేని పరిస్థితి. దీనివల్ల ప్లాంటు రెండు రకాలుగా నష్టపోతోంది. కోకింగ్ కోల్ తీసుకువచ్చి కోక్ తయారుచేసుకుంటే ఉత్పత్తి వ్యయం తగ్గడమే కాకుండా ఓవెన్ల ద్వారా వచ్చే వృథా వాయువులతో రోలింగ్ మిల్స్ అన్నీ 100 శాతం నడుస్తాయి. దానివల్ల ఫినిషిడ్ స్టీల్ తయారవుతుంది. మార్కెట్‌లో అమ్ముకుంటే మంచి రేటు వస్తుంది. ప్లాంటులో 100 శాతం స్టీల్ ఉత్పత్తి కోసం రోజుకు 8 వేల టన్నుల కోక్ అవసరం. అందుకోసం కోక్ ఓవెన్ల నుంచి 350కు పైబడి పుషింగ్స్ తీయాలి. కానీ ఆ స్థాయిలో పుషింగ్స్ రాకపోవడంతో రోజుకు 3 వేల నుంచి 4 వేల టన్నుల కోక్ కొంటున్నారు. కోక్ ఇప్పుడు మార్కెట్‌లో టన్ను రూ.39 వేలు ఉంది. అంటే టన్నుపై అధమంగా రూ.10 వేలు అదనంగా వెచ్చించాల్సి వస్తోంది. అలాగే పెల్లెట్లు కూడా కొనాల్సి వస్తోంది. ఈ రెండింటినీ కొంటూ స్టీల్ తయారుచేస్తే రోజుకు రూ.30 కోట్లు నష్టం వస్తుందని ఇటీవల ఓ సమావేశంలో ప్లాంటు అధికారులు వెల్లడించారు.

# భారీగా పెరిగిన బీర్‌ల అమ్మకాలు

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** వేసవి కారణంగా జిల్లాలో బీర్‌లకు డిమాండ్ పెరిగింది. గత ఏడాదితో పోల్చితే విక్రయాలు 46 శాతం వరకూ పెరిగాయి. జిల్లాలో 160 మద్యం దుకాణాలతోపాటు 96 బార్‌లు ఉన్నాయి. ఇవికాకుండా 18 స్టార్ హోటళు ,, ఆరు క్లబ్‌లు, ఐదు ఏపీ టూరిజం బార్లలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది మార్చి నుంచి ఎండలు ఎక్కువగా ఉండడంతో బీర్‌ల విక్రయాలు కూడా పెరుగుతూ వచ్చాయి. 2024 డిసెంబరు నుంచి 2025 మార్చి వరకు జిల్లావ్యాప్తంగా 4,89,698 బీర్ కేసులు అమ్ముడవ్వగా, ఏప్రిల్‌లో 1,90,517, మే నెలలో 1,30,876 కేసులు అమ్ముడయ్యాయి. మొత్తం డిసెంబరు నుంచి మే నెలాఖరు వరకు 8,11,091 బీర్ కేసులు అమ్ముడయ్యాయి.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలు తిష్ఠ



**అనంతగిరి, పతాకం న్యూస్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలు తిష్ఠ వేశాయి. కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా బాలురకు వసతి గృహం లేకపోవడంతో అద్దె గదుల్లో ఉంటూ చదువుకోవలసిన పరిస్థితి నెలకొంది. మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థినీ, విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి ఉంది. ప్రభుత్వాలు మారుతున్నా కళాశాల సమస్యలు పరిష్కారం కావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో 2002లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటైంది. కొంత కాలం వివిధ ప్రభుత్వ భవనాల్లో కళాశాలను నిర్వహించారు. ఆ తరువాత సొంత భవనం నిర్మించి అందులో కళాశాలను నిర్వహిస్తున్నారు. ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ కోర్సులు ఉండగా, సుమారు 350 మంది విద్యార్థినీ, విద్యార్థులు చదువుతున్నారు. అయితే ప్రహరీ గోడ లేకపోవడంతో రక్షణ లేకుండా ఉంది. కళాశాల ప్రాంగణంలో పశువులు యథేచ్ఛగా సంచరించడం, రాత్రి వేళ మందుబాబులు ఇక్కడే మద్యం సేవిస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రహరీ గోడ లేకపోవడంతో ప్రతి ఏడాది కర్రలతో దడికట్టి పరదాలతో నెట్టుకొస్తున్నారు. కాగా నాడు- నేడు రెండో విడతలో రూ.17 లక్షలతో బాలికలు, బాలురకు సంబంధించి పది మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. దాదాపు 80 శాతం పనులు పూర్తికాగా, ఆ తరువాత పనులు నిలిచిపోయాయి. దీంతో మరుగుదొడ్లు అందుబాటులోకి రాలేదు. దీని వలన విద్యార్థినీ, విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక బాలుర వసతి గృహ నిర్మాణం పిల్లర్లకే పరిమితమైంది. 2021-22లో బాలుర వసతి గృహం నిర్మాణానికి ట్రైబల్ వెల్ఫేర్ నిధులు రూ.2 కోట్లను కేటాయించారు. పిల్లర్ల వరకు పనులు జరిగి, ఆ తరువాత అర్ధాంతరంగా నిలిచిపోయాయి. బిల్లులు అందకపోవడం వల్లే కాంట్రాక్టర్ పనులను నిలిపివేసినట్టు తెలిసింది. ఇప్పటికైనా ప్రజాప్రతి నిధులు, అధికారులు స్పందించి జూనియర్ కళాశాలలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# 'సాలూరు-విశాఖ రైలు నడపండి'



**బొబ్బిలి, పతాకం న్యూస్:** సాలూరు-బొబ్బిలి మీదుగా విశాఖపట్నం వరకూ రైలు నడపాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. అలాగే బొబ్బిలి రైల్వే వ్యాగన్ లోడింగ్, అన్ లోడింగ్ పాయింట్ పునరుద్ధరించాలని కోరారు. డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జూన్ 3న బొబ్బిలి రైల్వే స్టేషన్ వద్ద తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని స్థానిక రైల్వేస్టేషన్ ఎదుట కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొబ్బిలి నుంచి సాలూరు వరకు రైలు మార్గంలో పది గ్రామాలకు చెందిన 15 వేల మంది ప్రజలు నివసిస్తున్నారన్నారు. ఈ గ్రామాలకు సరైన బస్సు సౌకర్యం లేదని, వారికి రైలు ఆదరువు అన్నారు. విద్య, వైద్యం తదితర అవసరాల కోసం ప్రజలు రైలుపై అధికంగా ఆధారపడుతుంటారన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని సాలూరు- విశాఖ మధ్య రైలును నడపాలన్నారు. కరోనా సమయంలో రైలును రద్దు చేసి ఇప్పటివరకు పునరుద్ధరించక పోవడంతో ఈ ప్రాంతీయులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పి.శంకరరావు, మెరుగని గోపాలం, శ్రీనివాస్, అప్పన్న, మువ్వల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** శ్రీకాకుళంలోని సూర్య మహల్ జంక్షన్ సమీపంలో వేకువ జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బిర్లంగి గణేష్ (20) దుర్మరణం పాలయ్యాడు. ఇప్పుడే వెళ్లి వచ్చేస్తానమ్మా అని చెప్పి వెళ్లిన ఆ కుమారుడు తల్లికి కడుపుకోత మిగిల్చాడు. ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు... హయాతినగరం సమీపంలో ఉన్న టీచర్స్ కాలనీకి చెందిన బిర్లంగి గణేష్ నగరంలోని కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆయన తండ్రి రామారావు ఉపాధ్యాయుడిగా, తల్లి ఇందిర వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉద్యోగినిగా పనిచేస్తున్నారు. అయితే గణేష్ వేకుజామున ఐదు గంటల సమీపంలో తన స్నేహితుడి వద్ద బైక్‌ను తీసుకొని సూర్యమహల్ జంక్షన్ మీదుగా రామలక్ష్మణ జంక్షన్‌కు వెళ్తున్నాడు. ఆ సమయంలో మార్గమధ్యలో సన్‌మ్యాక్స్ థియేటర్ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌కు ఆనుకొని ఉన్న ర్యాంప్‌ను బైక్‌తో ఢీకొన్నాడు. దీంతో బైక్ గాలిలోకి లెగిసి దగ్గరలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కింద పడిపోవడంతో గణేష్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఒక్కసారిగా పెద్ద శబ్దంరావడంతో అటుగా వాకింగ్‌కు వెళుతున్నవారు ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట సుధాకర్ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం గణేష్ మృతదేహాన్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. తండ్రి రామారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ట్రాఫిక్ సీఐ వానపల్లి రామారావు తెలిపారు. చేతికి అందివచ్చి చేదోడు వాదోడుగా నిలుస్తాడని అనుకున్న కుమారుడు తిరిగి రాడని తెలుసుకున్న గణేష్ తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. గణేష్ తల్లి ఇందిర కుమారుడు మరణ వార్త విని విలపిస్తూ కుప్పకూలిపోయింది. ఆ ప్రాంత వాసులు, బంధువులంతా శోకసముద్రంలో నిలిచారు. వచ్చేస్తానమ్మా అని చెప్పి వెళ్లిన కుమారుడు గంటల వ్యవధిలోనే మరి రాడని తెలిసిన ఆ తల్లి రోదన వర్ణణాతీతంగా మారింది.

# మహిళలు అప్రమత్తంగా ఉండాలి




**సరుబుజ్జిలి, పతాకం న్యూస్:** మహిళలు ప్రయాణాలు చేసే సమ యంలో ధరించే ఆభరణాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ బి.హైమావతి సూచించారు. మండలంలోని నందికొండ గ్రామంలో జరుగుతున్న ఉపాధిపథకం పనుల్లో వేతనదారులకు పోలీసులు అవగాహ న కార్యక్రమాన్ని నిర్వహించారు. శరభ సాగరం చెరువులో ఉపాధి పనులను నిర్వహిస్తున్న మహిళా కూలీలకు స్థానిక ఎస్ఐ బి.హైమావతి నారీశక్తి యాప్‌పై వివరించారు. మహిళలను అన్ని విధాలుగా రక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు రూపొందించాయని తెలి పారు.ప్రభుత్వం రూపొందించిన కొత్త చట్టాలపై అవగాహన పొందడంతో పాటు ఆపద సమయంలో ఉన్న మహిళలు నారీశక్తి యాప్ ద్వారా తక్షణ రక్షణ పొందాలని ఎస్ఐ చెప్పారు.

# అబట్మెంట్ డిజైన్లపై విదేశీ నిపుణుడు సిన్ హించ్‌బెర్గర్ సంతృప్తి



**పోలవరం, పతాకం న్యూస్:** ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ పనులకు సంబంధించి గ్యాప్-2లో కొండను కలిపే అబట్మెంట్ డిజైన్లపై విదేశీ నిపుణుడు సిన్ హించ్‌బెర్గర్ సంతృప్తి వ్యక్తం చేశారు. పోలవరం ప్రధాన డ్యామ్ పనులకు 'ఆఫ్రీ' రూపొందించిన డిజైన్లపై ఆయన దాదాపు రెండున్నర గంటలపాటు పోలవరం నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, ఇతర ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. పోలవరం ప్రాజెక్టును సందర్శించేందుకు విదేశీ నిపుణులు హించ్ బెర్గర్, రిచర్డ్ డొనెల్లీ రావాల్సి ఉంది. అయితే అనారోగ్య కారణాల వల్ల డొనెల్లీ రాలేదు. హించ్ బెర్గర్ ఒక్కరే బుధవారం రాజమండ్రికి చేరుకున్నారు. పోలవరం ప్రాజెక్టులో ప్రధాన కట్టడాలను పరిశీలించిన ఆయన ాడయాఫ్రమ్ వాల్‌పై వేస్తున్న ఈసీఆర్ఎ?ఫను పరిశీలించారు. కుడి, ఎడమ కాలువల టన్నెళ్లను, బంకమట్టి రీచ్‌ను పరిశీలించారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణాన్ని కేంద్ర జల సంఘం ఆమోదించిన మేరకు చేపడుతుండటంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్నం దాదాపు రెండున్నర గంటలపాటు ఈసీఆర్ఎఫ్ నిర్మాణ తీరును, 25 మీటర్ల ఎత్తులో గ్యాప్-2 కొండకు ఈసీఆర్ఎ?ఫను కలుపుతూ చేపట్టే అబట్మెంట్ డిజైన్లనూ పరిశీలించారు. ఈ డిజైన్లపై బెర్గర్ సంతృప్తి వ్యక్తం చేయడంతో దీన్ని పీపీఏ ద్వారా కేంద్ర జల సంఘం ఆమోదానికి పంపనున్నారు. పర్యటనలో చివరి రోజైన శుక్రవారం హించ్ బెర్గర్ ప్రత్యేకంగా రాజమండ్రిలోని పీపీఏ కార్యాలయంలో సీఈవో సంజీవ్ వోరాతో సమావేశమవుతారు. మూడు రోజుల పర్యటనలో పరిశీలించిన పనులపై కెనడాకు చేరుకున్నాక.. హించ్ బెర్గర్ నివేదికను ఇవ్వనున్నారు. కాగా, ఈ పర్యటనలో కేంద్ర జలవనరుల సంఘం చీఫ్ ఇంజనీర్ సరబ్జిత్‌సింగ్ బక్షి, డైరెక్టర్ మనీష్ రాథోడ్, ఉప సంచాలకులు అశ్వనీ కుమార్ వర్మ, గౌరవ్ తివారీ, జలవనరులశాఖ ఉప కమిషనర్ గౌరవ్ సింఘాయ్, కేంద్ర మట్టి, రాతి పదార్థాల పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు సచిన్ గుప్త, రవి అగర్వాల్, పీపీఏ ముఖ్య కార్య నిర్వహణాధికారి సంజీవ్ వోహ్రా, సభ్య కార్యదర్శి ఎం.రఘురామ్, చీఫ్ ఇంజనీర్ ఎం.రమేష్ కుమార్, ఏపీ జలవనరులశాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఇంజనీరింగ్ చీఫ్ నరసింహమూర్తి, ఎస్ఈ రామచంద్రరావు, మేఘా చీఫ్ జనరల్ మేనేజర్ రఫీ, జీఎం గంగాధర్, డీజీఎం మురళి పమ్మి పాల్గొన్నారు.

# ఇకపై వాట్సాప్ లో సమన్లు, వారెంట్లు! అమల్లోకి తీసుకొచ్చిన హైకోర్టు



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్ర న్యాయవ్యవస్థలో డిజిటల్ విధానాలకు ప్రాధాన్యం ఇస్తూ హైకోర్టు 'ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ ప్రక్రియల (జారీ, బట్వాడా, అమలు) నిబంధనలు--2025'ను అమల్లోకి తీసుకొచ్చింది. ఈ నిబంధనల ప్రకారం ఇకపై కోర్టు సమన్లు, వారెంట్లు వాట్సాప్, సిగ్నల్, టెలిగ్రామ్, ఈమెయిల్ వంటి డిజిటల్ మాధ్యమాల ద్వారా నిందితులు, సాక్షులు, బాధితులకు పంపించనున్నారు. దీంతో 'సమన్లు అందలేదు', 'ఊరిలో లేను' వంటి కారణాలతో తప్పించుకునే అవకాశాలు తగ్గనున్నాయి. కేసుల విచారణలు వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంది. మెసేజ్ డెలివరీ అయినట్లు చూపే స్క్రీన్‌షాట్ లేదా ఈమెయిల్ డెలివరీ రిపోర్టును అధికారిక సాక్ష్యంగా కోర్టులు పరిగణిస్తాయి. కోర్టు జారీ చేసే ప్రతి ఎలక్ట్రానిక్ సమనుపై డిజిటల్ ముద్ర, డిజిటల్ సంతకం తప్పనిసరిగా ఉంటుంది. పోలీసులు అరెస్టు లేదా విచారణ సమయంలోనే నిందితులు, సాక్షుల ఫోన్ నెంబర్లు, ఈమెయిల్ వివరాలను సేకరించి సిసిటిఎన్ఎస్‌లో నమోదు చేయాలి. బాధితులు, సాక్షుల వివరాలు గోప్యంగా ఉంచాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ ఫోన్ నంబర్ లేదా ఈమెయిల్ అందుబాటులో లేకపోతే పాత పద్ధతిలోనే సమన్లు అందజేస్తారు. కేస్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (సిఐఎస్), సిసిటిఎన్ఎస్ పరస్పరం అనుసంధానం కావడంతో కోర్టు ఉత్తర్వులు వెంటనే పోలీసులకు చేరనున్నాయి. సమన్ల ప్రింటవుట్‌కూ అసలు పత్రంతో సమాన విలువ ఉంటుందని నిబంధనల్లో పేర్కొన్నారు. ఇటీవల హైకోర్టు రూపొందించిన ఈ నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌లో ప్రచురించింది.

# 'ఆక్వా' రంగ సమస్యల పరిష్కారానికి కృషి: మంత్రి అచ్చెన్నాయుడు




**అమరావతి, పతాకం న్యూస్:** ఆక్వాకల్చర్ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి కె. అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రొయ్యల మేత ధరల పెరుగుదల, ముడి పదార్థాల కొరత, రైతులపై పెరుగుతున్న వ్యయభారం, ఎగుమతుల సవాళ్లు వంటి అంశాలపై మత్స్యశాఖ ఆధ్వర్యాన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో రైతులు, ఫీడ్ తయారీదారులు, ఎగుమతిదారులు, పరిశ్రమ ప్రతినిధుల అభిప్రాయాలను ప్రభుత్వం గ్రహించిందని అన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న వేసవి పంట సమయంలో మేత ధరల పెంపు రైతులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని, అదే సమయంలో మేత పరిశ్రమ ముడి పదార్థాల ధరల పెరుగుదలతో ఒత్తిడిని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా, పరిశ్రమ నిలదొక్కుకునేలా సమతుల్య నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మేత, రొయ్యపిల్లల నాణ్యతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, సిసిటివి ఆధారిత హ్యాచరీ పర్యవేక్షణ, సీడ్ ట్రేసబిలిటీ, ఐఒటి ఆధారిత మానిటరింగ్ వంటి సాంకేతిక చర్యలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. జిఎం సోయా దిగుమతులు, ఫిష్ మీల్ లభ్యత, దిగుమతి లైసెన్సులు, ఎగుమతి పోటీతత్వం వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు. ఆక్వా రైతుల సంక్షేమం, మేత పరిశ్రమ స్థిరత్వం, ఎగుమతుల వృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందని, అందరు భాగస్వాములు పరస్పర సహకారంతో ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, మత్స్యశాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్, ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి, ఎఎసి సభ్యులు, ఎపిఎస్ఎడిఎ సభ్యులు, రైతు సంఘాలు, ఫీడ్ తయారీదారులు, ఎగుమతిదారుల సంఘాలు, పరిశ్రమ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# నీట్ లీక్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్య



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఎన్నో ఆశలతో 'నీట్' పరీక్ష రాసిన యువతను ఇలా నిరాశపరచకూడదని భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో జరిగిన లీక్‌ల నుంచి గుణపాఠం నేర్చుకోలేదంటూ గతవారం కేంద్ర సంస్థ ఎన్టీఏపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తాజాగా, నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడం వల్ల యువత తీవ్రమైన మానసిక క్షోభను అనుభవిస్తోందని వ్యాఖ్యానించింది. ఈ ఏడాది మే 3వ తేదీన దేశవ్యాప్తంగా జరిగిన నీట్-యూజీ 2026 పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. తన పర్యవేక్షణలో నిర్వహించే అన్ని పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉన్నట్లు పేర్కొంది. పేపర్ లీకేజీ, మాల్ ప్రాక్టీస్ వంటి ఘటనలు జరగకుండా ఉండేలా చర్యలు చేపట్టేందుకు కేంద్ర విద్యాశాఖతో కలిసి పనిచేస్తున్నట్లు పేర్కొంది. పరీక్షల్లో పారదర్శకతను పెంచేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన మాజీ ఇస్రో ఛైర్మన్ కె. రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సులలో చాలావరకు ఇప్పటికే అమలు చేసినట్లు తెలిపింది. పరీక్ష విధానంలో తాము తీసుకొచ్చిన సంస్కరణలు, భద్రతా మార్పులను కోర్టుకు వివరించింది. ఎన్టీఏ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడం కోసం 16 కొత్త సీనియర్ పోస్టులను ఏర్పాటు చేశామని, టెక్నాలజీ ఆపరేషన్స్, టెస్ట్ సెక్యూరిటీ పర్యవేక్షణకు ఇద్దరు జాయింట్ సెక్రటరీల స్థాయి అధికారులను అడిషనల్ డైరెక్టర్స్ జనరల్‌గా నియమించినట్లు అఫిడవిట్‌లో పేర్కొంది. పరీక్ష కేంద్రాల్లో సీసీటీవీలను ఏర్పాటు చేయడం, పరీక్ష పూర్తయ్యాక 90 రోజుల పాటు ఫుటేజీని భద్రపరచాలని ఆదేశించినట్లు తెలిపింది. భవిష్యత్తులో నీట్ పరీక్షలను కంప్యూటర్ ఆధారిత పరీక్ష మోడ్‌లో నిర్వహించాలా లేక పెన్ అండ్ పేపర్ పద్ధతిలోనే కొనసాగించాలా అనే అంశంపై అత్యున్నతస్థాయి కమిటీ సంబంధిత మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు జరిపి త్వరలో ఓ నిర్ణయం తీసుకోనుందని కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొంది. ఐఐటీ, యూజీసీ, సీబీఎస్ఈ తదితర సంస్థల నిపుణులను ఎగ్జామినేషన్ మేనేజ్‌మెంట్‌లో భాగస్వామ్యం చేసినట్లు ఎన్టీఏ కోర్టుకు తెలిపింది.

# ఐదు కేజీల గంజాయి స్వాధీనం



**పొందూరు, పతాకం న్యూస్:** పొందూరు రైల్వేస్టేషన్‌లో అనుమానంగా సంచరిస్తున్న ఇద్దరి మహిళల నుంచి పోలీసులు ఐదు కేజీ గంజాయి ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, ఎస్ఐ వి.సత్యనారాయణ పట్టుబడిన మహిళలతో విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐ అవతారం కథనం మేరకు.. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల నేపథ్యంలో పొందూరు ఎస్ఐకు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో ఎస్ఐ వి.సత్యనారాయణ మధ్యాహ్నం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్‌లో అనుమానంగా సంచరిస్తున్న మహారాష్ట్రకు చెందిన మంగళ దీపక జాదూ, మనోభై సంపత్తిలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న సామానులను పరిశీలించగా సుమారు ఐదు కేజీల గంజాయి బయటపడింది. మహిళలను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. పొట్టకూటికోసం ఇద్దరు మహిళలు ఒడిశాలోని ఛత్రపూర్‌లో రాజేష్ అనే వ్యక్తి వద్ద రూ.25 వేలకు ఐదు కేజీల గంజాయి కొనుగోలు చేశారు. అనంతరం గంజాయితో మహారాష్ట్ర చేరుకునేందుకు శ్రీకాకుళంలో కోనార్క్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాల్సి ఉంది. పొరపాటున శ్రీకాకుళానికి అనుకుని పొందూరులో రైలు దిగిపోయారు. సమాచారం రావడంతో పోలీసులకు ఇద్దరు మహిళలు పట్టుబడ్డారు. పొందూరు డీటీ రాధాకృష్ణ, వీఆర్వోల సమక్షంలో పట్టుబడ్డ మహిళలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. గంజాయి పట్టుకున్న ఎస్ఐను సీఐ అవతారం అభినందించారు.

# కాక్రోచ్ జనతా పార్టీ ఖాతా నిలిపివేత.. కేంద్రానికి, ఎక్స్ సంస్థకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** మన దేశంలో కాక్రోచ్ జనతా పార్టీ తాజా సంచలనాలకు కేంద్ర బిందువుగా మారిన సంగతి తెలిసిందే. పెద్ద సంఖ్యలో యువత, సెలబ్రిటీలు ఈ పార్టీకి మద్దతుగా నిలుస్తున్నారు. మరోవైపు, ఈ పార్టీ ఎక్స్ ఖాతాను ఇండియాలో నిలిపి వేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఎక్స్ ఖాతాను నిలిపివేయడంపై కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఎలాంటి కారణం లేకుండానే తమ పార్టీ ఖాతాను ఎక్స్ నిలిపి వేసిందంటూ ఆయన పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ పై నేడు హైకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ పురుషైంద్ర కుమార్ కౌరవ్ ధర్మాసనం పిటిషన్ ను విచారించింది. ఈ సందర్భంగా అభిజిత్ తరపు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ... ఎక్స్ ఖాతా నిలిపివేయడం ద్వారా పార్టీ కార్యకలాపాలు, ప్రజలతో సంబంధాలు దెబ్బతింటున్నాయని కోర్టుకు తెలిపారు. వెంటనే పార్టీ ఎక్స్ ఖాతాను పునరుద్ధరించాలని కోరారు. ఈ వాదనలపై కోర్టు స్పందిస్తూ... తక్షణమే ఎక్స్ ఖాతాను పునరుద్ధరించాలన్న విన్నపాన్ని తిరస్కరించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి, ఎక్స్ సంస్థకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జులై 7వ తేదీకి వాయిదా వేసింది. తదుపరి విచారణలోగా కేంద్ర ప్రభుత్వం, ఎక్స్ సంస్థ తమ సమాధానాలను సమర్పించాలని ఢిల్లీ హైకోర్టు సూచించింది.

# పరిశుభ్రమైన పరిసరాల కోసం ప్రజల భాగస్వామ్యం అవసరం

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేయడం, డ్రైనేజీల్లో చెత్త వేయడం వలన ప్రజారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, ప్రతి పౌరుడు పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ పారిశుద్ధ్య నిబంధనలు పాటించాలని ,పరిశుభ్రమైన పరిసరాల కోసం ప్రజల భాగస్వామ్యం అవసరమని జీవీఎంసీ నార్త్ జోన్ జోనల్ కమిషనర్ బి. రాము పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నార్త్ జోన్ పరిధిలో వార్డు నెం.49లో బహిరంగ మూత్ర విసర్జన నివారణ, డ్రైనేజీల్లో వ్యర్థాలు పడవేయడాన్ని నిరోధించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రజారోగ్య పరిరక్షణ, అలాగే పరిశుభ్రమైన పరిసరాల నిర్వహణపై అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేయకుండా నిర్దేశిత మరుగుదొడ్లను వినియోగించాలని, డ్రైనేజీల్లో ప్లాస్టిక్, చెత్త మరియు ఇతర వ్యర్థాలను వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రైనేజీలు పరిశుభ్రంగా ఉంటేనే నీటి నిల్వలు, దుర్వాసనలు, దోమల వ్యాప్తి వంటి సమస్యలను నివారించవచ్చని తెలిపారు. పరిశుభ్రమైన , ఆరోగ్యకరమైన నగర నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జోనల్ కమిషనర్ పిలుపునిచ్చారు. అలాగే జరుగుచున్న 2025 -26 స్వచ్ఛ సర్వేక్షన్ లో విశాఖ నగరాన్ని దేశంలోనే ఉత్తమ పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలన్నారు.

# ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డు మరమ్మతు పనులు నిలిపివేత..



**విజయవాడ, పతాకం న్యూస్:** నగరంలో ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీకనకదుర్గమ్మ ఆలయ ఘాట్ రోడ్డు పనుల మరమ్మతును ఆర్ అండ్ బీ అధికారులు తాత్కాలికంగా వాయిదా వేశారు. శుక్రవారం నుంచి ఘాట్ రోడ్డుపైకి భక్తుల రాకపోకలకు యథావిధిగా అనుమతి ఇస్తామని తెలిపారు. భారీగా ఎండలు, వడగాల్పుల కారణంగా.. ఘాట్ రోడ్డు మరమ్మతు పనులు కొనసాగించలేమని ఆర్ ఆండ్ బీ అధికారులు వివరించారు. తొలుత ఈ ఘాట్ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని దేవస్థానం ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ పనులు జూన్ 12వ తేదీ వరకు కొనసాగుతాయని వెల్లడించారు. దీంతో ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకునే భక్తులకు పలు ఆంక్షలు విధించారు. కొండపైకి వివిధ మార్గాల్లోల రావాలంటూ భక్తులకు స్పష్టం చేశారు. అయితే విజయవాడలో ఎండలు మండిపోతున్నాయి. వేడి గాలులు వీస్తున్నాయి. దీంతో మధ్యాహ్నం వేళ.. పనులు చేయాలంటే అధికారులే కాదు.. కార్మికులు సైతం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం దేవస్థానం ఉన్నతాధికారులకు చేరింది. దీంతో ఈ ఘాట్ రోడ్డు మరమ్మతు పనులను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించారు.

# 11 వేల మంది టీచర్లకు ఓపీఎస్!



**అమరావతి, పతాకం న్యూస్:** కూటమి ప్రభుత్వం సుమారు 11 వేల మంది ఉపాధ్యాయులకు మేలు చేసేలా త్వరలో ఓ కీలక నిర్ణయం తీసుకోనుంది. 2002, 2003 నోటిఫికేషన్ల ద్వారా 2004 తర్వాత భర్తీ అయిన టీచర్లకు పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్) అమలుకు చర్యలు ప్రారంభించింది. 2003 డీఎస్సీ టీచర్ల విజ్ఞప్తుల నేపథ్యంలో ప్రభుత్వం దీనిపై సానుకూల నిర్ణయం తీసుకొనే దిశగా అడుగులు వేసింది. సంబంధిత ఫైలును ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపి.. అధికారిక ప్రక్రియను ప్రారంభించింది. కొద్ది రోజుల్లోనే దీనిపై అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. రాష్ట్రంలో 2004 సెప్టెంబరు 1 నుంచి కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) అమల్లోకి వచ్చింది. అంతకముందు నియామకం అయిన ఉద్యోగులకు మాత్రమే ఓపీఎస్ అమలు చేస్తున్నారు. గత కొంతకాలంగా సీపీఎస్‌ను రద్దు చేయాలనే ఉద్యమం జరుగుతోంది. అయితే 2002, 2003 నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాలు పొందిన దాదాపు 11 వేల మంది టీచర్లు వివిధ కారణాలతో 2004 తర్వాత ఉద్యోగాల్లో చేరారు. దీంతో వారు సీపీఎస్ పరిధిలోకి వచ్చారు. సీపీఎస్ అమలు కంటే ముందే విడుదలైన నోటిఫికేషన్ల ద్వారా తాము ఉద్యోగాలు పొందినందున, తమకు ఓపీఎస్ అమలు చేయాలని ఆ టీచర్లు కోరుతూ వస్తున్నారు. నోటిఫికేషన్లు ముందే విడుదలయ్యాయనే అంశాన్ని ప్రామాణికంగా తీసుకున్న కూటమి ప్రభుత్వం వారికి పాత పెన్షన్ స్కీం అమలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది.

# నెల్లూరు, ఒంగోలు, విజయవాడ మీదుగా వేసవి ప్రత్యేక రైళ్లు..



**అమరావతి, పతాకం న్యూస్:** వేసవి సెలవుల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం తాంబరం-సంత్రాగచ్చి, తాంబరం-బోడినాయకనూరు మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా.. నెం.06075 తాంబరం-సంత్రాగచ్చి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 26, మే 2వ తేదీల్లో తాంబరం నుంచి ఉదయం 10.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 6.30 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06076 సంత్రాగచ్చి-తాంబరం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27, జూన్ 3వ తేదీల్లో సంత్రాగచ్చిలో రాత్రి 9.30గంటలకు బయల్దేరి మూడోరోజు ఉదయం 10.30 గంటలకు తాంబరం చేరుకుంటుంది. ఈరైళ్లు చెన్నై ఎగ్మూర్, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, విజయనగరం, పలాస, ఖుర్దా రోడ్డు మీదుగా నడుస్తాయి. ఈ రైళ్ల ముందస్తు రిజర్వేషన్ శుక్రవారం ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుందని దక్షిణ రైల్వే తెలిపింది. నెం.06059 తాంబరం-బోడినాయకనూరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23,30, జూన్ 6,13 తేదీల్లో తాంబం నుంచి రాత్రి 10.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11.15 గంటలకు బోడినాయకనూరు చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06060 బోడినాయకనూరు-తాంబరం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 24,31, జూన్ 7,14 తేదీల్లో బోడినాయకనూరు నుంచి సాయంత్రం 4.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు తాంబరం చేరుకుంటుంది.

# ప్రైవేటు విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్‌పై రవాణాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్‌పై రవాణాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నెల 1 నుంచి అధికారులు ఐదు బృందాలుగా బస్సుల సామర్థ్యం తనిఖీ చేస్తున్నారు. ఆటోమేటిక్ టెస్టింగ్ విధానంలో తనిఖీ చేసి ధ్రువీకరణ పత్రం ఇస్తున్నారు. రోడ్డు భద్రత, వాహనాల ఫిట్‌నెస్, అగ్నిమాపక నియంత్రణ పరికరాలు, డ్రైవర్ లైసెన్స్ చెల్లుబాటు, పర్మిట్లు వంటివి పరిశీలిస్తున్నారు. చాలా బస్సుల్లో లోటుపాట్లు బయటపడుతున్నాయి. జిల్లాలో 614 బస్సులు ఉండగా.. ఈ నెల 18 నాటికి 291 బస్సులను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని 66 మంది యాజమానులకు నోటీసులు అందజేశారు. జిల్లాలో మూడు ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయి. రాగోలు జెమ్స్‌లోని మెడికల్, నర్సింగ్ కాలేజీలు నడుస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలలు 398, ప్రైవేటు జూనియర్ కాలేజీలు 71, డిగ్రీ కాలేజీలు 85 ఉన్నాయి. వీటి పరిధిలో 614 బస్సులు నడుస్తున్నాయి. వీటికి ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలో సామర్థ్య పరీక్షలు తప్పనిసరి. కొన్నేళ్లుగా స్కూల్ బస్సుల సామర్థ్య పరీక్షలు అస్తవ్యస్తంగా సాగినట్టు విమర్శలు ఉన్నాయి. అందుకే ప్రమాదాలు జరిగినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మానవ తప్పిదాలకు, అక్రమాలకు అవకాశం ఇవ్వకుండా ఆటోమేటిక్ టెస్టింగ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. యంత్రాల సాయంతో సామర్థ్యాన్ని తనిఖీ చేస్తారు. వాహనం నుంచి వెలువడుతున్న పొగ, బ్రేక్, లైట్ల పనితీరును పరిశీలిస్తారు. అందులో ఏ చిన్నలోపం ఉన్నా ధ్రువీకరణపత్రం రాదు. కండిషనల్‌లో ఉన్న వాహనాలకే ధ్రువపత్రం అందుతుందని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. గత ఏడాది స్కూల్ బస్సులు ప్రమాదానికి గురయ్యాయి. ఏకంగా చెరువులు, కాలువల్లోకి బస్సులు దూసుకెళ్లిన సందర్భాలు ఉన్నాయి. అదృష్టవశాత్తూ మరణాలు సంభవించలేదు. అయితే ప్రమాదాలకు బస్సులు కండిషన్ లేకపోవడం ఒక ఎత్తయితే.. అరకొరగా శిక్షణ పొందిన డ్రైవర్లు కూడా మరో కారణం. శిక్షణ పొందిన ఆరోగ్యంగా ఉన్న డ్రైవర్లనే ఎంపిక చేయాలి. ముందుగా వారి నుంచి ఫిట్‌నెస్ పొందాలి. కంటిచూపు సక్రమంగా ఉండడంతోపాటు మూర్ఛ వంటి వ్యాధులు లేని వారిని ఎంపిక చేసుకోవాలి. అయితే నిష్ణాతులైన డ్రైవర్లకు అధిక వేతనం ఇవ్వాల్సి వస్తోందని కొన్ని యాజమాన్యాలు వయసు పైబడిన వారికి సైతం డ్రైవర్లుగా ఎంపిక చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. బస్సు డ్రైవర్‌కు హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు నాలుగేళ్లు అనుభవం ఉండాలి. కానీ కొందరు లైట్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారికి సైతం బస్సుడ్రైవర్‌గా ఎంపిక చేసినట్టు తెలుస్తోంది.

సురక్షితమైన, కండీషన్‌లో ఉన్న బస్సులనే వినియోగించాలి. 15ఏళ్లు దాటిన బస్సులను వినియోగించకూడదు. కానీ కొన్ని పాఠశాలలు పాత బస్సులకు రంగులు వేసి నడుపుతున్నట్టు ఆరోపణలున్నాయి. 32 అంశాలతో కూడిన నిబంధనలు పాటించాలి. పిట్‌నెస్, ఇన్సూరెన్స్ తప్పనిసరి. బస్సులో విద్యార్థుల వివరాల పట్టిక నమోదు చేయాలి. బస్సు ముందు, వెనుక భాగాల్లో స్కూల్ బస్సు, ఆన్ స్కూల్ డ్యూటీ అని రాయాలి. బస్సులో ఫస్ట్‌ఎయిడ్ బాక్సు, ఎమర్జెన్సీ డోర్ ఏర్పాటు చేయాలి. అగ్నిప్రమాద నివారణ పరికాలు అందుబాటులో ఉంచాలి. కిటికీలకు నెట్ తప్పనిసరిగా ఉంచాలి. బస్సు తలుపులకు లాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలి. బస్సులో పిల్లల కోసం సహాయకులను నియమించాలి. గంటకు 40 కిలోమీటర్ల వేగానికి మించకుండా స్పీడ్ గవర్నెన్స్ ఏర్పాటుచేయాలి. కానీ గత కొన్నేళ్లుగా ఈ నిబంధనలేవీ అమలైన దాఖలాలు లేవు. ఈ ఆటోమేటిక్ టెస్టింగ్ విధానంతోనైనా వాటికి చెక్ పడుతుందా? లేదా? అన్నది చూడాలి.

# ప్రాంతీయ సమతుల్యతతోనే వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి




**విజయనగరం, పతాకం న్యూస్:** ప్రాంతీయ సమతుల్యత పాటించడంతోనే వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని, అందుకోసం ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని జెవివి రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు సూచించారు. విజయనగరంలోని జిల్లా పరిషత్ మినిస్టీరియల్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా జెవివి నిర్వహిస్తున్న ఫ్యూచర్ ఆఫ్ ఇండియా అనే కార్యక్రమాన్ని విజయనగరం నుంచి నాయకత్వ శిక్షణ శిబిరం ద్వారా తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. నేడు దేశంలో వికసిత భారత్, స్వర్ణాంధ్ర అని పాలకులు చెబుతున్నా ఆచరణలో అటువంటి పరిస్థితి కనిపించడంలేదని విమర్శించారు. దేశం అభివృద్ధి చెందాలంటే నీటి పారుదల రంగంపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వెలిగొండ ప్రాజెక్టు వంటి వాటికి కనీసం నిధులు కేటాయించడంలేదన్నారు. మరోవైపు రాష్ట్రంలో ఇప్పటికే నిర్మాణం జరిగిన పది మెడికల్ కాలేజీలను టిడిపి కూటమి ప్రభుత్వం పిపిపి పద్ధతిలో ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. పేదలున్న వెనుకబడిన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలకు రూ. ఆరు వేల కోట్లు కేటాయించి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించేలా చూడాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్రంలో విద్యా రంగాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలోని 24 యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న ఐదువేల అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మరో వైపు విద్యా రంగంలో జ్యోతిష్యం, వాస్తు వంటి అంశాలను తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతుందన్నారు. మూఢనమ్మకాలను ప్రోత్సహించడం సరికాదన్నారు. శాస్త్రీయ విద్యా విధానం కోసం జెవివి పోరాడుతుందన్నారు. విలేకర్ల సమావేశంలో జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవిఎన్ వెంకటరావు, రమణ ప్రభాత్ , జెవివి సమత కన్వీనర్ జి నిర్మల తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి హామీ చట్టం రద్దు కుట్రలను తిప్పికొడతాం




**ఒంగోలు, పతాకం న్యూస్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలనుకుంటున్న 'విబి గ్రామ్ జి ' చట్టాన్ని దేశ ప్రజలు అంగీకరించబోరని సిపిఐ జాతీయ నాయకులు హెచ్చరించారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజాపోరాటాలు నిర్వహిస్తామని ప్రకటించారు. భారతీయ కిసాన్ మజ్దూర్ యూనియన్ (బికెఎంయు) జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ప్రారంభమయ్యాయి. 'ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి -- విబి గ్రామ్ జి రద్దు చేయాలి' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో 18 రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. సెమినార్‌కు బికెఎంయు జాతీయ అధ్యక్షుడు పెరియార్ స్వామి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ కార్యదర్శులు అన్నీ రాజా, కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య హాజరయ్యారు. జాతీయ కార్యదర్శి అన్నీ రాజా మాట్లాడుతూ... నిరుద్యోగ, పేదరిక నిర్మూలన పేరుతో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం, ఇప్పుడు గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ చట్టాన్నే బలహీనపరుస్తోందని విమర్శించారు. అవసరమైన నిధులు కేటాయించకుండా చట్టాన్ని నిర్వీర్యం చేసి, ఇప్పుడు 'విబిగ్రామ్ జి' పేరుతో కొత్త చట్టాన్ని తీసుకురావడం పేదల జీవన హక్కుపై దాడేనని పేర్కొన్నారు. గ్రామీణ కార్మికులకు 100 రోజుల పని హామీ ఇవ్వాల్సి ఉండగా అనేక ప్రాంతాల్లో 50 రోజులకే పరిమితం చేస్తున్నారని, కూలి బకాయిలు కూడా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ... పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేస్తే ప్రజలు సహించరని హెచ్చరించారు. దేశంలో 40 శాతం మంది గ్రామీణ పేదలకు ఉపాధి హామీ చట్టం ఆధారమైందని పేర్కొన్నారు. విబి గ్రామ్ జి చట్టానికి వ్యతిరేకంగా ఆగస్టు ఆరు నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహించి, సెప్టెంబర్ 15న 'చలో ఢిల్లీ' కార్యక్రమం చేపడతామని ప్రకటించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలతో పేదలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడే వారిపై ఇడి, సిబిఐ సంస్థలను ఉపయోగించి వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ... పేదల పొట్టకొట్టే విబి గ్రామ్ జి చట్టానికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామన్నారు. సిపిఐతో పాటు ప్రజాసంఘాలు, ఇతర రాజకీయ పక్షాలను కలుపుకుని ఉద్యమాలను ఉద్ధృతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బికెఎంయు గౌరవాధ్యక్షుడు జల్లి విల్సన్, జాతీయ ప్రధాన కార్యదర్శి గుల్జార్ సింగ్ గోరియా, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్.వెంకట్రావు, మార్కాపురం జిల్లా సిపిఐ కార్యదర్శి ఎంఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 'ఉండి' బాధితులకు వెంటనే
# నష్ట పరిహారం చెల్లించాలి



**అమరావతి, పతాకం న్యూస్:** పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలో దళిత, బలహీన వర్గాల పేదల ఇళ్ళ కూల్చివేతను తక్షణమే నిలిపివేసి, బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్, వృత్తిదారుల సమన్వయ రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేశాయి. విజయవాడలోని ఎంబివికె భవనంలో ఆ సంఘాలు, భాదితుల తో కలిసి గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాయి. ఈ సమావేశానికి రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు డి.రమాదేవి, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎమ్.భాస్కరయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. లోకనాథం తీర్మానం ప్రవేశపెట్టారు. ఉండి నియోజకవర్గంలో 6 దశాబ్దాలుగా నివాసం ఉంటున్న దళిత బలహీనవర్గాల పేదల ఇళ్ళ అక్రమ కూల్చి వేతను తక్షణమే ఆపి, ఇప్పటి వరకు కూల్చిన ఇళ్ళకు నష్ట పరిహాఅందిచాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో పేదల ఇళ్ళు కూల్చి వేసిన స్థానిక ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజును డిప్యూటీ స్పీకర్ పదవి నుండి తొలగించి క్రిమినల్ కేసు పెట్టి అరెస్టు చేయాలన్నారు. రమాదేవి మాట్లాడుతూ.. ఇళ్ళు కోల్పోయిన కాలల్లో ఏడాది పాటు ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. వారికి ఉచితంగా రేషన్, విద్యుత్, మంచినీరు అందించాలన్నారు. రాష్ట్రంలో ఇలాంటి దుర్మార్గపు పనులు జరుగుతుంటే ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ..డిప్యూటి స్పీకర్ 'ఆర్ఆర్ఆర్' రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉండి చేసే దుర్మార్గపు పనులు బయట ప్రపంచానికి తెలియాలన్నారు. కూల్చిన ఇళ్ళకు ప్రత్యామ్నాయం చూపాలని, వాటిలో ఇళ్ళు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లక్షలు ఖర్చు పెట్టి ఇల్లు కట్టుకున్న మహిళా ఇల్లు కూల్చుతుంటే గుండెపోటు రావడంతో ఆసుపత్రిలో వైద్యం కోసం చేరిస్తే ఆరోగ్య శ్రీ అమలు కావాలంటే స్థానిక ఎంఎల్ఎ దగ్గర సంతకం చేయించుకుని రావాలని డాక్టర్లు చెప్పటం అన్యాయమన్నారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై. కేశవరావు మాట్లాడుతూ.. చట్టం ప్రతి ఒక్కరికి నివాసం కల్పించాలని చెబుతుందని, కానీ వీరు చట్టన్ని పక్కన పడేసి అక్రమంగా ఇళ్ళు కూల్చివేయడం అన్యాయమని అన్నారు.

## ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతులు: మంత్రి భరత్



**కర్నూలు, పతాకం న్యూస్:** నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతుల పనులను చేపడుతున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత అన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి వివిధ వార్డుల్లో రూ.1.17 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. నగరంలోని 22, 23, 23, 25 వార్డుల్లో రూ.35.40 లక్షలతో సీసీ రోడ్లు, హెచడీపూఈఈ పైప్‌లైన్లు, కమ్యూనిటీ టాయిలెట్ల మరుమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 42, 43, 45, 46 వార్డుల్లో రూ.65.25 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, పార్కు అభివృద్ధి, పైపులైన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే 47, 48, 50, 52 వార్డుల్లో రూ.16.99 లక్షలతో కమ్యూనిటీ టాయిలెట్ల మరమ్మతులు, డ్రైన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రి టీజీ భరత మాట్లాడుతూ నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు.

## ప్రొఫెసర్ నాగేశ్వరరావుపై కేసులు ఎత్తివేయాలి

**విజయనగరం, పతాకం న్యూస్:** ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వరరావు పై కూటమి నాయకులు కేసులు పెట్టి వాక్స్వతంత్యాన్ని నియంత్రించే చర్యలు మానుకోవాలని ఆయనపై పెట్టిన కేసులు వేయాలని, నాగేశ్వరరావు పై సోషల్ మీడియాలో జనసేన కార్యకర్తలు పెడుతున్న అసభ్యకర పోస్టులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏపీడబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టిసి కాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. జరిగిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏపీడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ నాయుడు మాట్లాడుతూ ప్రొఫెసర్ నాగేశ్వరరావు పై అన్యాయంగా కేసులు పెట్టి వేధించడం సరికాదన్నారు. ఆయన జరిపిన చర్చలపై ఏమైనా అనుమానం ఉంటే చర్చల్లో పాల్గొని దానికి సమాధానం చెప్పాలి తప్ప కేసులు పెట్టి ఉక్రోసాని వెళ్లగట్టి సోషల్ మీడియాలో ఇస్తారాజ్యంగా దూషిస్తూ పోస్టులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇటువంటి చర్యలు జనసేన నాయకులు, కార్యకర్తలు మానుకోవాలన్నారు రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్రం హక్కును కాలరాసే అధికారం ఎవరికి లేదని ఇటువంటి చర్యలు మానుకోవాలని, జర్నలిస్టులను అవమానించే విధంగా కేసులు పెట్టి భయపెట్టి ప్రయత్నం మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఏదైనా చెప్పాలనుకుంటే చర్చల ద్వారా చేసుకోవడం తప్ప అధికారం ఉందని అధికార బలంతో కేసులు పెట్టి జర్నలిస్టులు హక్కుల మీద దాడి చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు.

## పంటల మద్దతు ధరలు పెంచాలి



**రణస్థలం, పతాకం న్యూస్:** వ్యవసాయానికి పెరిగిన పెట్టుబడికి అనుగుణంగా పెంటలు మద్దతు ధరలు పెంచాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెలమల రమణ, మజ్జి రమన డిమాండ్ చేశారు. కొండములగాం గ్రామంలో ఏపీ కౌలు రైతుల సంఘం, అంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ పంటల మద్దతు ధరలు నిర్ణయించడంలో కేంద్ర ప్రభుత్వ మోసపూరిత వైఖరిని ఖండిస్తూ వ్యవసాయ పంటల మద్దతు ధరల జీవో కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మొక్కజొన్న పంటకు కనీస మద్దతు ధర 2400 ఉండగా కేవలం పది రూపాయలు పెంచి రూ.2410, వరికి క్వింటాకు రూ. 2441గా నిర్ణయించడం యావత్ భారత దేశ రైతులందరికి అన్యాయం చేయడమేనని చెప్పారు.

## డ్రైనేజీని శుభ్రం చేయండి మహాప్రభో



**ప్రొద్దుటూరు, పతాకం న్యూస్:** డ్రైనేజీని శుభ్రం చేయండి మహాప్రభో అని ప్రజలు మొరపెట్టుకుంటున్నారు. ఎపి ప్రభుత్వం ఆపరేషన్ క్లీన్ స్వీప్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారులు, అంతర్గత వీదులు, పారిశుద్ధ్య లోపాలు, మున్సిపల్ సర్వేలో గుర్తించిన రెడ్ అండ్ ఎల్లో స్పాట్లను ఎక్కువగా చెత్త పేరుకు పోయే ప్రాంతాలు, డ్రైనేజీ కాలువలను శుభ్రపరచడం వంటి అంశాలను ఆపరేషన్ క్లీన్ స్వీప్‌లో చేర్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. పొద్దుటూరు పట్టణంలోని మార్కెట్ యార్డ్ మొదలుకొని తహసిల్దార్ ఆఫీస్ వరకు రహదారి ప్రక్కన ఉన్న డ్రైనేజీ కాలువలు మాత్రం ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో చేర్చారా లేదా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆ డ్రైనేజీ కాలువ చెత్తా,చెదారం, ప్లాస్టిక్ బాటిల్స్ తో నిండిపోయింది. ఆ కాలువను శుభ్రపరచకపోవడం వలన చిన్నపాటి వర్షానికే రోడ్ల మీదికి నీరు వచ్చి వాహనదారులను, పాదచారులను ఇబ్బందులకు గురిచేస్తుంది. మురికి నీరు నిల్వ ఉండడం వలన దోమలు ఎక్కువ అయ్యి మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలను శుభ్రపరచాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# పిల్లల్లో పెరుగుతున్న 'ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్'!

ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ (ASD)ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పిల్లల్లో ఎక్కువగా గుర్తించబడుతున్న న్యూరో డెవలప్‌మెంటల్ సమస్యలలో ఒకటిగా మారుతోంది. సామాజిక పరస్పర చర్యలు, కమ్యూనికేషన్, ప్రవర్తనలో ప్రత్యేక లక్షణాలతో కనిపించే ఈ పరిస్థితి పిల్లల రోజువారీ జీవితంపై ప్రభావం చూపుతోంది. అయితే సరైన సమయంలో సరైన మద్దతు లభిస్తే ఆటిజం ఉన్న పిల్లలు కూడా ఆత్మవిశ్వాసంతో, భద్రతతో ఎదుగుతారని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చికిత్స మాత్రమే కాకుండా ఇంటి వాతావరణం కూడా కీలక పాత్ర పోషిస్తుందని సూచిస్తున్నారు. పిల్లలు కళ్లలోకి చూడకపోవడం, పేరు పిలిచినా స్పందించకపోవడం, మాట్లాడకపోవడం, చూపించి చెప్పే అలవాటు లేకపోవడం లేదా ముందుగా వచ్చిన కొన్ని నైపుణ్యాలు తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. చిన్న వయస్సులోనే సమస్యను గుర్తించడం వల్ల మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని చెబుతున్నారు.

ప్రారంభ దశలోనే మద్దతు అందించడం చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. జీవితంలోని తొలి సంవత్సరాల్లో సరైన సహాయం అందితే కమ్యూనికేషన్, ప్రవర్తన, స్వతంత్రంగా పనులు చేసుకునే సామర్థ్యంలో మెరుగుదల కనిపించే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు, తాతమ్మలు, సోదరులు పిల్లలకు మొదటి మద్దతుదారులుగా ఉండాలని సూచిస్తున్నారు. థెరపీ సెంటర్లలో మాత్రమే కాదు, ఇంట్లో ప్రతిరోజూ జరిగే ఆటలు, సంభాషణలు, పరస్పర చర్యల ద్వారా కూడా



ప్రారంభ సహాయం అందించవచ్చని చెబుతున్నారు. చిన్నారులను స్క్రీన్‌లకు ఎక్కువగా అలవాటు చేయకుండా ఉండటం కూడా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా రెండేళ్ల వయస్సు వచ్చే వరకు స్క్రీన్ టైమ్ ను పూర్తిగా నివారించడం మంచిదని చెబుతున్నారు. బదులుగా పిల్లలు కుటుంబ సభ్యులతో కలిసి ఆడే ఆటలు, పాల్గొనే కార్యకలాపాలను ప్రోత్సహించాలని సూచిస్తున్నారు.

మాట్లాడడంలో ఇబ్బంది పడే పిల్లలకు Augmentative and Alternative Communication (AAC) పద్ధతులు ఎంతో ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. పిక్చర్ బోర్డులు, కమ్యూనికేషన్ పుస్తకాలు, టాబ్లెట్‌లలో ఉండే స్పీచ్ యాప్స్ ద్వారా పిల్లలు తమ అవసరాలు, భావాలను వ్యక్తపరచగలుగుతారు. తల్లిదండ్రులు కూడా పిల్లలతో మాట్లాడేటప్పుడు అదే గుర్తులను ఉపయోగించడం ద్వారా పిల్లలకు అర్థం కావడం సులభమవుతుంది. దీని వల్ల నిరాశ తగ్గి, కమ్యూనికేషన్ మెరుగుపడే అవకాశం ఉంటుంది. ప్రతి చిన్నారిలో ఉండే ప్రత్యేక ఆసక్తులను గుర్తించి వాటి ద్వారా నేర్పించడం కూడా మంచి ఫలితాలు ఇస్తుందని నిపుణులు చెబుతున్నారు.

ఉదాహరణకు పిల్లలకు ట్రైన్లు ఇష్టమైతే వాటి ద్వారా లెక్కలు, కథలు, వర్గీకరణ వంటి కార్యకలాపాలు నేర్పించవచ్చు. రంగులు, బ్లాక్స్, మట్టి వంటి సృజనాత్మక వస్తువులు పిల్లలు భావాలను వ్యక్తపరచడంలో సహాయపడతాయి. పిల్లల ఆసక్తుల ఆధారంగా నేర్పితే ఒత్తిడి తగ్గి, నేర్చుకోవడం ఆనందంగా మారుతుందని చెబుతున్నారు.

క్రమబద్ధమైన దినచర్య ఉండాలి..

పిల్లలకు క్రమబద్ధమైన దినచర్య ఉండటం కూడా చాలా అవసరం. నిద్రలేవడం, భోజనం, ఆటలు, చదువు, నిద్ర వంటి కార్యకలాపాలకు ఒక నిర్దిష్ట సమయ పట్టిక ఉండేలా చూడాలి. చిత్రాలతో కూడిన విజువల్ టైమ్‌టేబుల్స్ ఉపయోగిస్తే పిల్లలకు అర్థం అవడం సులభమవుతుంది. రోజూ ఒకే విధమైన క్రమం పాటించడం వల్ల పిల్లల్లో ఆందోళన తగ్గి భద్రత భావన పెరుగుతుంది. ఆటిజం ఉన్న పిల్లలను చూసుకోవడం తల్లిదండ్రులకు భావోద్వేగపరంగా కష్టంగా మారే అవకాశమూ ఉంటుంది. అందుకే తల్లిదండ్రులు కూడా తమ ఆరోగ్యాన్ని, మానసిక ప్రశాంతతను పట్టించుకోవాలి. అవసరమైతే కౌన్సెలింగ్ తీసుకోవడం, ఇతర తల్లిదండ్రులతో మాట్లాడడం, సపోర్ట్ గ్రూప్‌లలో చేరడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. ఆటిజం ఉన్న పిల్లలను మార్చాలని కాదు, వారిని అర్థం చేసుకుని వారికి అనుకూలమైన వాతావరణం కల్పించడమే అ1సలు లక్ష్యం. కుటుంబం నుంచి వచ్చే ప్రేమ, సహనం, ప్రోత్సాహం పిల్లల ఎదుగుదలలో కీలక పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకుల కొరత!

## ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు..



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకుల కొరత అధికంగా ఉంది. అదే విధంగా చాలా కాలేజీల్లో క్రీడా మైదానాలు లేవు. దీంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. గతంలో అంతర్ జూనియర్ కాలేజీ, అంతర్ డిగ్రీ కాలేజీ క్రీడాకారులు అన్న మాట వినిపించేది. కానీ ఇప్పుడు క్రీడా పోటీల్లో ఆ పేరు వినిపించడం లేదు. అంతలా తయారైంది కాలేజీ స్థాయిలో క్రీడల పరిస్థితి. గతంలో చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. ఏటా క్రమం తప్పకుండా విద్యార్థులకు క్రీడా పోటీలు జరిగేవి. కానీ, ఇప్పుడు క్రీడాకారులు బయట అసోసియేషన్ల తరపున ఆడాల్సిన పరిస్థితి నెలకొంది. గత కొద్దిరోజులుగా కాలేజీ స్థాయిలో క్రీడలకు ప్రోత్సాహం లేకుండా పోతోంది. ముఖ్యంగా క్రీడల్లో విద్యార్థులకు శిక్షణనిచ్చేవారు కరువయ్యారు.

జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. దాదాపు పది వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. కానీ, వీరికి క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు కనీస స్థాయిలో ఒక్క వ్యాయామ అధ్యాపకుడు సైతం లేకపోవడం దారుణం. అప్పట్లో జూనియర్ కాలేజీ అంటే ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాలు కొనసాగేవి. ఏటా క్రమం తప్పకుండా క్రీడా పోటీలు నిర్వహించేవారు. అప్పట్లో వ్యాయామ అధ్యాపకులు ఉండేవారు. కానీ వారు పదవీవిరమణ తరువాత కొత్తగా పోస్టులు భర్తీ చేయలేదు. అలాగని సబ్జెక్టు బోధకుల మాదిరిగా కాంట్రాక్టు ప్రతిపాదికన నియమించలేదు. దీంతో కాలేజీల్లో క్రీడా శిక్షణ లేకుండా పోయింది. జిల్లా కేంద్రంలో పేరుమోసిన ప్రభుత్వ కాలేజీల్లో సైతం క్రీడలకు స్థానం లేకుండా పోయింది.

జిల్లాలో చాలా ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు మైదానాలు లేవు. 38 కాలేజీలకుగాను 16 కాలేజీల్లో అస్సలు మైదానాలే లేనట్టు తెలుస్తోంది. ఉన్న మైదానాలు సైతం సరైన నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారాయి. కొన్నిచోట్ల గత వైసీపీ సర్కారు నాడు-నేడు పనుల పేరిట అస్తవ్యస్తంగా మార్చేసింది. భవన నిర్మాణ సామగ్రితో పాటు తొలగించిన భవనాలకు సంబంధించి వేస్ట్ మెటీరియల్‌ను పడేసింది. దీంతో ఆటలు అనేవి లేకుండా పోయాయి. విద్యార్థులు తమకు తాము ఆసక్తితో ఆటలాడుకోవడమే కానీ.. ఆడించేవారు మాత్రం లేకుండా పోయారు. గత ఐదేళ్ల పాటు ప్రభుత్వ కాలేజీల స్థాయిలో క్రీడా పోటీలు కూడా నిర్వహించలేదు. ఎన్నికలకు ముందు గ్రామాల్లో మాత్రం ఆడుదాం ఆంధ్రా పేరిట హడావుడి చేశారు. అంతకు మించి క్రీడల పట్ల గత ప్రభుత్వం చిత్తశుద్ధి చూపిన దాఖలాలు మాత్రం లేవు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. ఈ ఏడాదైనా వ్యాయామ అధ్యాపకుల నియామకం చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

# 'పెట్రో- భారాలు, కేంద్ర నిరంకుశ విధానాలపై 9న రాస్తారోకో



**అమరావతి, పతాకం న్యూస్:**రోజువారీ లెక్కన పెట్రోలు, డీజిల్ ధరలు పెంచుతూ కేంద్రం ప్రజలపై పెద్ద ఎత్తున భారాలు మోపుతోందని, దీనికి వ్యతిరేకంగా జూన్ 9న రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకో నిర్వహించాలని వామపక్ష పార్టీలు నిర్ణయించాయి. అలాగే ప్రతిపక్ష నాయకులపై కేంద్ర విచారణా సంస్థలను ప్రయోగించి అప్రజాస్వామిక విధానాలను అనుసరిస్తోందని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో సిపిఐ(ఎంఎల్) నాయకులు జాస్తి కిషోర్‌బాబు అధ్యక్షతన జరిగిన వామపక్ష పార్టీల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు హరినాథ్‌రెడ్డి, సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, పొలారి, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు హరినాథ్, ఎంసిపిఐ(యు) నాయకులు గణేష్ పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొనలేకపోయిన ఆర్ఎస్‌పి, ఫార్వార్డ్ బ్లాక్, న్యూడెమొక్రసీ, ఎస్‌యుసిఐ(సి) నాయకులు సమావేశ నిర్ణయాలకు మద్దతు ప్రకటించారు. అనంతరం బాలోత్సవ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో నిరంకుశ చర్యలు, పౌరహక్కులు, ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని తెలిపారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్ ధరలను ఇప్పటికి నాలుగుసార్లు పెంచడాన్ని సమావేశం తీవ్రంగా ఖండించినట్లు చెప్పారు. మరలా ధరలను పెంచుతున్నట్లు వచ్చిన వార్తల పట్ల సమావేశం ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. కేంద్రం తీరుకు వ్యతిరేకంగా జూన్ 1 నుండి ఏడో తేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం కరపత్రాల పంపిణీ, సమావేశాలు, సదస్సుల రూపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కేజీ బేసిన్ గ్యాస్ సాధన కోసం పాశర్లపూడి ప్రాంతంలో వామపక్షాలు జూన్ మొదటివారంలో పర్యటిస్తాయని వివరించారు. కేంద్రం పెట్రోలు ధరలను రోజువారీ లెక్కన పెంచుతోందని, దీనివల్ల ఉపాధిపై ప్రభావం పడుతోందని, రోజువారీ కూలీలు, చిన్న ఉద్యోగులు, తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. పెట్రోలు ధరల్లో 54 రూపాయలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులే ఉన్నాయని, ధరలు పెరిగిన సమయంలో పన్నులు తగ్గించుకుని ప్రజలపై భారాలు పడకుండా చూడాల్సిన ప్రభుత్వం ఆ పనిచేయడంలో చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. పెరిగిన ధరలను ప్రజలపైనే రుద్దుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.




# యశస్వి జైస్వాల్ రాజస్థాన్ రాయల్స్ జట్టును వీడాలి: అంబటి రాయుడు



భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు మాజీ ఆటగాడు అంబటి రాయుడు ఒక సంచలన సూచన చేశాడు. రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) జట్టును వీడితేనే జైస్వాల్ కెరీర్‌కు మంచిదని, అతడు మరో జట్టుకు మారాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశాడు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ దూకుడు ముందు జైస్వాల్ ప్రదర్శన మసకబారుతోందని రాయుడు అభిప్రాయపడ్డాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆరెంజ్ క్యాప్ హోల్డర్‌గా నిలిచిన వైభవ్ సూర్యవంశీ అద్భుత ఫామ్‌తో చెలరేగుతున్నాడు. ఎలిమినేటర్ మ్యాచ్‌లో సూర్యవంశీ కేవలం 29 బంతుల్లో 97 పరుగులతో విరుచుకుపడగా, అదే మ్యాచ్‌లో జైస్వాల్ 29 బంతులు ఆడి 29 పరుగులే చేశాడు. ఈ నేపథ్యంలో రాయుడు మాట్లాడుతూ, "జైస్వాల్ తన జట్టును మార్చుకోవాలి. ప్రతీసారి తోటి ఆటగాడి నీడలో మగ్గిపోకూడదు. అతడికంటూ సొంత స్టార్‌డమ్ ఉంది. మరో జట్టుకు వెళితే ఒంటిచేత్తో మ్యాచ్‌లు గెలిపించగలడు. అతడికి ఆ స్వేచ్ఛ, అందుకు తగిన వేదిక అవసరం" అని అన్నాడు. జైస్వాల్‌కు ముంబై ఇండియన్స్ జట్టు సరైన గమ్యస్థానం అవుతుందని రాయుడు సూచించాడు. రోహిత్ శర్మ కెరీర్ చివరి దశలో ఉన్నందున, ముంబై జట్టులో ఓపెనర్‌గా, భవిష్యత్ నాయకుడిగా ఎదిగేందుకు జైస్వాల్‌కు మంచి అవకాశం లభిస్తుందని విశ్లేషించాడు. 2020 నుంచి రాజస్థాన్ రాయల్స్‌కు ఆడుతున్న జైస్వాల్, ఇప్పటికే టీమిండియాలో కీలక ఆటగాడిగా మారిన నేపథ్యంలో రాయుడు వ్యాఖ్యలు క్రికెట్ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి.

## ఫైనల్లో బెర్త్ కోసం..

# గుజరాత్‌తో రాజస్థాన్ ఢీ





ఐపీఎల్-19వ సీజన్ ఫైనల్‌కు ముందు చిట్టచివరి ప్లేఆఫ్స్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. గుజరాత్ టైటాన్స్-రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య శుక్రవారం క్వాలిఫయర్-2 జరుగనుంది. ఈనెల 31న రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో జరిగే ఫైనల్లో తలపడేందుకు ఇరు జట్లకిదే ఆఖరి అవకాశం. రాజస్థాన్ 2008 ఆరంభ సీజన్‌లో విజేతగా నిలవగా.. ఆ తర్వాత 2022లో మాత్రమే ఫైనల్‌కు రాగలిగింది. ఆ మ్యాచ్‌లో గుజరాత్ చేతిలోనే పరాభవం ఎదురుకాగా.. నేడు ఆర్ఆర్‌కు బదులు తీర్చుకునే సమయం వచ్చింది. ఇక క్వాలిఫయర్ 1లో పేలవ ఆటతీరుతో ఆర్‌సీబీ చేతిలో చిత్తుగా ఓడిన టైటాన్స్‌కిది రెండో అవకాశం. ఇరు జట్లు ఓవరాల్‌గా 10 మ్యాచ్‌ల్లో తలపడగా 7-3తో గిల్ సేన ఆధిపత్యంలో ఉంది. ఈ సీజన్‌లో చెరో మ్యాచ్ గెలిచాయి. ఏదిఏమైనా ఇదే మైదానంలో 29 బంతుల్లో 97 పరుగులు బాదిన వైభవ్‌ను టైటాన్స్ బౌలర్లు ఏమేరకు నిలువరిస్తానేది ఆసక్తికరంగా మారింది. ఫైనల్‌కు దూసుకెళ్లాలంటే గుజరాత్ ఓపెనర్ల నుంచి మెరుపు ఆరంభం రావాల్సి ఉంటుంది. సాయి సుదర్శన్-శుభ్‌మన్ గిల్ నిలకడకు మారుపేరైనా.. వీరి ఆటలో టీ20 తరహా హిట్టింగ్ కనిపించదు. శుక్రవారం ఆ బలహీనతను అధిగమించాల్సి ఉంటుంది. క్వాలిఫయర్1లో టాపార్డర్ పూర్తిగా విఫలం కావడం దెబ్బతీసింది. తెవాటియాను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు పంపితే ప్రయోజనం ఉంటుంది. మిడిలార్డర్‌లో అండగా నిలిచే బ్యాటర్ లేకపోవడం లోపంగా కనిపిస్తోంది. జట్టు బౌలింగ్ మాత్రం పకడ్బందీగానే ఉంది. ఆర్‌సీబీపై తేలిపోయినా.. ఓవరాల్‌గా వీరి ప్రదర్శన అద్భుతంగానే ఉంది. పేసర్ రబాడ (26), సిరాజ్ (17) స్పిన్నర్ రషీద్ ఖాన్ (19) ప్రత్యర్థిని ఇబ్బందిపెట్టగలరు. ఆల్‌రౌండర్లు వాషింగ్టన్ సుందర్, జేసన్ హోల్డర్ రాణిస్తే గుజరాత్‌కు తిరుగుండదు. కానీ నేటి మ్యాచ్‌లో వైభవ్‌ను వీరంతా ఏమేరకు నిలువరించగలరనే దానిపైనే విజయావకాశాలుంటాయి. ఎలిమినేటర్‌లో పటిష్ట సన్‌రైజర్స్‌ను చిత్తు చేసిన జోష్‌లో రాజస్థాన్ కీలక మ్యాచ్‌కు సిద్ధం కానుంది. ఎప్పటిలాగే చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీపైనే జట్టు ఆధారపడి ఉంది. పవర్‌ప్లేలోనే తను మ్యాచ్‌ను శాసిస్తున్నాడు. కానీ అతడి జోరును అందుకోవడంలో మిగతా బ్యాటర్లు విఫలమవుతున్నారు. బుధవారం ఓ దశలో ఆర్ఆర్ 280 రన్స్ చేస్తుందని ఆశించారు. కానీ చివరకు 250 కూడా చేయలేకపోవడం గమనార్హం. జురెల్ మినహా మిగతా బ్యాటర్లు తడబడ్డారు. వైభవ్ సునామీ ఇన్నింగ్స్ లేకపోతే జట్టు కచ్చితంగా నిష్క్రమించేదే. అయితే తాజా సీజన్‌లో గుజరాత్‌తో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో తను 31, 36 పరుగులు మాత్రమే చేయడం ఆందోళనకరమే. సిరాజ్, రబాడ అతడిని అడ్డుకోగలిగారు. అందుకే వైభవ్‌పైనే ఆధారపడకుండా ఓపెనర్ జైస్వాల్, కెప్టెన్ పరాగ్, ఫెరీరా, షనక బ్యాట్లు ఝుళిపించాల్సిందే. బౌలింగ్‌లో పేసర్ ఆర్చర్ ఆరంభంలోనే వికెట్లు తీస్తూ కీలకంగా నిలుస్తున్నాడు. బర్గర్ తనకు తోడుండగా.. మధ్య ఓవర్లలో బ్రిజేశ్, యష్ రాజ్, జడేజా ప్రత్యర్థిని కట్టడి చేస్తున్నారు. ఫైనల్ చేరే క్రమంలో ఈ చివరి అడ్డంకిని స్థాయికి తగ్గ ఆటతీరుతో అధిగమించాలని రాయల్స్ భావిస్తోంది.

గుజరాత్: గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, బట్లర్, నిశాంత్, సుందర్, హోల్డర్, తెవాటియా, రషీద్, రబాడ, సిరాజ్, ప్రసిద్ధ్.

రాజస్థాన్: వైభవ్, జైస్వాల్, జురెల్, పరాగ్ (కెప్టెన్), ఫెరీరా, షనక, జడేజా, ఆర్చర్, బర్గర్, సుశాంత్, బ్రిజేశ్, యష్ రాజ్.

వికెట్‌పై చక్కటి బౌన్స్ ఉండడంతో ఆరంభంలో వేగంగా పరుగులు వచ్చే అవకాశం ఉంది. అలాగే కొత్త బంతితో పేసర్లు, మధ్య ఓవర్లలో స్పిన్నర్లు ప్రభావం చూపవచ్చు. మంచు ప్రభావంతో ఇక్కడ టాస్ గెలిచిన జట్లు ఫీల్డింగ్‌కు మొగ్గుచూపాయి. అయినా చివరి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ ఓడిన విషయం తెలిసిందే.




# నాన్ స్టాప్.. యాక్షన్‌లోకి మహేష్ బాబు?



దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం వారణాసి . ఈ క్రేజీ ప్రాజెక్ట్ అనౌన్స్ అయినప్పటి నుంచే టాలీవుడ్‌తో పాటు గ్లోబల్ లెవెల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్యాన్ వరల్డ్ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుండటం విశేషం. అలాగే మలయాళ ప్రముఖ నటుడు పృథ్వీరాజ్ సుకూమారన్ విలన్‌గా నటిస్తూ సినిమాపై మరింత ఆసక్తిని పెంచేస్తున్నారు. ఈ ముగ్గురి కలయికతో సినిమా రేంజ్ ఎక్కడికో వెళ్ళిపోవడంతో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికులు ఈ విజువల్ వండర్ కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం మహేష్ బాబు తన కెరీర్‌లోనే మునుపెన్నడూ లేని విధంగా మారిపోయాడు. రాజమౌళి సినిమాల్లో హీరోల క్యారెక్టరైజేషన్లు ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు, అందుకే మహేష్ బాబులోని నటనను స్క్రీన్ ప్రెజెన్స్‌ను జక్కన్న సరికొత్త కోణంలో ఆవిష్కరించబోతున్నారని, ఈ చిత్రం సూపర్ స్టార్ కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందని అభిమానులు నమ్ముతున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాజమౌళి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ సెట్టింగ్స్, అధునాతన వి ఎఫ్ ఎక్స్ (ఎఖీశ) స్టూడియోలతో పాటు రియల్ లొకేషన్స్ లో కూడా షూటింగ్‌ను ప్లాన్ చేశారు. చిత్ర యూనిట్ అన్ని విభాగాల్లోనూ ఎంతో ప్రతిష్టాత్మకంగా వర్క్ చేస్తోంది. సినిమా క్వాలిటీ అద్భుతంగా రావడం కోసం టెక్నికల్ పరంగా అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ఇటు మహేష్ బాబు కూడా జక్కన్న విజన్‌కు తగ్గట్టుగా సరికొత్త మేకోవర్‌తో ఈ షూటింగ్‌లో పాల్గొంటున్నారు.సినిమా రివ్యూస్

ఈ తరుణంలోనే ఈ సినిమాకు సంబంధించిన ఒక క్రేజీ లేటెస్ట్ అప్డేట్ బయటకు వచ్చింది. దీని ప్రకారం.. మేకర్స్ ప్రస్తుతం ఒక లాంగ్ యాక్షన్ షెడ్యూల్‌ను ప్రారంభించినట్టు తెలుస్తోంది. దాదాపు ఒక నెల రోజుల పాటుగా నాన్‌స్టాప్‌గా ఈ యాక్షన్ సీక్వెన్స్ షూట్ జరగనుందని సమాచారం. హాలీవుడ్ స్థాయి స్టంట్ మాస్టర్స్ పర్యవేక్షణలో రాబోయే ఈ యాక్షన్ ఎపిసోడ్స్ సినిమాకే ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయి. దీన్ని బట్టి చూస్తే ఈ ఒక్క నెల మొత్తం మన సూపర్ స్టార్ కంప్లీట్ యాక్షన్ మోడ్‌లోనే ఉంటారని స్పష్టమవుతోంది.

ఇక ఈ భారీ చిత్రానికి ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తుండగా, కే.ఎల్. నారాయణ, ఎస్.ఎస్. కార్తికేయ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఎక్కడా ఖర్చుకు వెనకాడకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్యాన్ వరల్డ్ లెవెల్లో గ్రాండ్‌గా విడుదల కాబోతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ అప్‌డేట్‌తో మహేష్ బాబు అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

# 'లెనిన్'పై ఆశలు పెట్టుకున్న భాగ్యశ్రీ బోర్సే



భాగ్యశ్రీ బోర్సే .. పాల సరస్సులో పూసిన తెల్లకలువలాంటి అందం. అమరశిల్పి జక్కన ఊహకి కూడా అందని శిల్పం. మబ్బులను .. మెరుపులను కలిపి చేసినట్టుగా కనిపించే రూపం. చోళులు .. చాళుక్యుల కాలం నాటి శిల్పాల వరుసలో తప్ప, ఈ మధ్య కాలంలో ఎవరూ ఎక్కడా చూడని ఒక లావణ్య విశేషం. విశాలమైన కళ్లతో విన్యాసాలు చేస్తూ ఆమె యూత్ హృదయాలను కొల్లగొట్టేస్తోంది. అలాంటి భాగ్యశ్రీ బోర్సే గురించి మాట్లాడుకోని కుర్రాళ్లు ఉండరనే చెప్పాలి. తెరపై భాగ్యశ్రీని చూసిన కుర్రాళ్లంతా ఈ అమ్మాయికి నటన తెలియక పోయినా ఫరవాలేదు. అలా తెరపై కనిపిస్తూ ఉంటే చాలానే అనుకుంటారు. అందువల్లనే పెద్దగా సక్సెస్ లు లేకపోయినా, అవకాశాలు మాత్రం వెతుక్కుంటూనే వస్తున్నాయి. వచ్చే నెల చివరి వారంలో ఈ సుందరి 'లెనిన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. అఖిల్ జోడీగా ఆమె చేసిన ఈ సినిమా, భారీ విజయాన్ని అందుకోవడం ఖాయమనే ఒక టాక్ బలంగానే వినిపిస్తోంది. అయితే ఇక్కడ మరో విశేషం ఏమిటంటే, 'పెద్ది' సినిమాలో భాగ్యశ్రీ కూడా మెరిసి ఉంటే బాగుండేదనే ఒక టాక్ ఇప్పుడు షికారు చేస్తోంది. 'పెద్ది'లో జాన్వీకపూర్ కథానాయికగా నటించగా, ఐటమ్ సాంగ్ లో శృతిహాసన్ సందడి చేయనుంది. మార్కెటింగ్ పరంగా చూసుకుంటే, మేకర్స్ నిర్ణయం సరైనదే అయినా, గ్లామర్ పరంగా చూసుకుంటే, భాగ్యశ్రీ కూడా ఎక్కడో ఒక చోట మెరిసే ఛాన్స్ ఇచ్చి ఉంటే బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చరణ్ తరువాత సినిమాలోనైనా ఈ బ్యూటీకి ఛాన్స్ దొరుకుతుందేమో.




# ఆగస్టు 14న 'విశ్వనాథ్ అండ్ సన్స్'



సూర్య తన కెరియర్ మొదలుపెట్టిన దగ్గర నుంచి ఎక్కడా పెద్దగా గ్యాప్ ఇవ్వకుండా వరుస సినిమాలు చేస్తూ వెళుతున్నాడు. అయితే ఆయనకి సరైన హిట్ పడి చాలా కాలమే అయింది. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన వచ్చిన 'వీరభద్రుడు' (కరుప్పు) కూడా తెలుగులో ఆశించిన స్థాయిలో ఆడలేదు. తమిళ నాడులో మాత్రం బాగానే ఆడిందనే వార్తలు వినిపించాయి. ఈ నేపథ్యంలో ఆయన తాజా చిత్రం నుంచి ఒక అప్‌డేట్ వచ్చింది. తనకి తెలుగు దర్శకులతో కలిసి పనిచేయాలని ఉందనీ, నేరుగా తెలుగు సినిమా చేయాలని ఉందని సూర్య ఎప్పటి నుంచో చెబుతూ వస్తున్నాడు. ఇన్నాళ్లకి ఆయన కల నిజమైందని చెప్పచ్చు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఆయన ఒక సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ సినిమా పేరే 'విశ్వనాథ్ అండ్ సన్స్'. రీసెంటుగా ఈ సినిమా నుంచి వదిలిన టీజర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. అలాంటి ఈ సినిమాను ఆగస్టు 14వ తేదీన విడుదల చేయనున్నట్టుగా ప్రకటించారు. ఒక 40 ఏళ్ల యువకుడికీ .. 20 ఏళ్ల యువతికి మధ్య నడిచే ప్రేమకథ ఈ సినిమాలో ప్రధాన మైనదిగా ప్రేక్షకులను అలరిస్తుందని చెబుతున్నారు. మామితా బైజు కథా నాయికగా నటించిన ఈ సినిమాలో, రాధికా శరత్ కుమార్ .. రవీనా టాండన్ కీలకమైన పాత్రలను పోషించారు. సితార బ్యానర్ పై నిర్మితమవుతున్న ఈ సినిమాను, తెలుగు .. తమిళ భాషల్లో విడుదల చేయనున్నారు. చాలాకాలంగా సూర్య వెయిట్ చేస్తున్న భారీ హిట్, ఈ సినిమాతోనైనా పడుతుందేమో చూడాలి

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**